بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ     نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ     وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly **BADAR** Qadian

www.akhbarbadrqadian.in

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

సంపుటి: 9

సంచిక : 06

వార్షిక చందా 600/-రూ॥

**08 ఫిబ్రవరి 2024 క్రీ, శ. 08 తబ్లీఘ్ 1403 హి, శ.**

**27 రజబ్ 1445 హి,ఖ.**

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

يٰۤاَيُّهَا الَّذِيۡنَ اٰمَنُوا اسۡتَجِيۡبُوۡا لِلّٰهِ وَلِلرَّسُوۡلِ اِذَا دَعَاكُمۡ لِمَا يُحۡيِيۡكُمۡ (سورۃ الانفال:25)

**అనువాదం: ఓ విశ్వాసులారా! అల్లాహ్ ప్రవక్త మిమ్ములను బ్రతికించుటకు పిలిచినప్పుడు ఉపస్థితులగుడు.**

**( అల్అన్ఫాల్: 25)**

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగా యున్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి ఆయురారోగ్యముల కొరకు, ఉన్నత ఆశయ సాధనాల కొరకు, వారి ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ ను అనుక్షణం రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).*

اَللّٰهُمَّ اَيِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ وَبَارِكۡ لَنَا فِيۡ عُمۡرِهٖ وَاَمۡرِهٖ

ఓ ప్రియులారా! ధర్మము మరియు ధార్మిక లక్ష్యయాల కొరకు సేవ చేయు సమయమిది. ఈ అవకాశాన్ని అదృష్టంగా భావించండి. ఇలాంటి అవకాశం మరల ఎన్నడు లభించదు........ జకాత్‌ను పంపించగలరు. ప్రతి వ్యక్తి తన వృధా ఖర్చులను తగ్గించుకొని, పొదుపుగాబడిన ధనమును దైవ మార్గంలో ఖర్చు చేయండి.

---

## సయ్యదినా హజ్రత్ మసీహ్ మౌవూద్ మరియు మహ్దియే మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఉపదేశాలు.

ఈ ఉపదేశాలన్నింటిని మేమిక్కడ వ్రాయడానికి గల కారణం ఏమిటనగా, మన జమాఅత్ దైవభీతిలో చాలా అభివృద్ధి చెందాలి. ఈ భూమండలంపై ఆవహిస్తున్న దైవాగ్రహం వారి వరకు చేరకుండా ఉండాలి. తావూన్ వ్యాపిస్తున్న ఈ రోజులలో వారు రక్షించబడాలి. నిజమైన ధార్మికత (నిజమైన ధార్మికత చాలా తక్కువగా ఉన్నది) దేవున్ని సంతృప్తి పరుస్తుంది. సంపూర్ణ విశ్వాసిని దేవుడు సాధారణముగా కాకుండా ఒక సంకేత రూపంలో కాపాడుతాడు. ప్రతి మోసగాడు, అజ్ఞానుడు తనకు తాను ధార్మికుడనని ప్రకటించుకుంటాడు. కాని దేవుని సంకేతాల ద్వారా నిష్టాపరుడని నిరూపించ బడినవాడే అసలైన ధార్మికుడు. నేను దేవున్ని ప్రేమిస్తున్నాను అని ప్రతి ఒక్కరు చెప్పుకోగలరు. కాని ఎవరి ప్రేమను గూర్చి ఆకాశం సాక్ష్యం ఇస్తుందో వారే ప్రేమించు వారగుదురు. తమదే అసలైన మతమని ప్రతి ఒక్కరు వాదించగలరు. కాని ఈ ప్రపంచంలోనే ఒక తేజస్సును అనుగ్రహించునది నిజమైన మతం. తనకు మోక్షం లభిస్తుందని ప్రతి ఒక్కరు భావించవచ్చును. కాని ఈ ప్రపంచంలోనే మోక్షపు తేజస్సును దర్శించుకున్నవారే అసలైన మోక్షపరులు. కావున మీరు దేవున్ని ప్రేమించుటకు ప్రయత్నించుము. తద్వారా మీరు అన్ని రకాల ఆపదల నుండి కాపాడబడుతారు. నిజమైన విశ్వాసి తావూన్ నుండి కాపాడబడుతాడు. ఎందుకనగా అతడు దేవుని రక్షణలో ఉంటాడు. అందుకే మీరు కూడ నిజమైన విశ్వాసులుగా మారండి. తావూన్‌ను గూర్చి దేవుడు చెప్పిన విషయాలను మీరు విన్నారు. అది ఒక ఆగ్రహపు జ్వాల. కావున మీరు ఆ జ్వాల నుండి రక్షించుకొనుడు. నిజాయితితో నన్ను అనుసరించు వ్యక్తి, ద్రోహం చేయని వ్యక్తి, అలసత్వం, నిర్లక్ష్యం వహించని వ్యక్తి, మంచి పనులతో చెడు పనులను కలుపని వ్యక్తి తప్పకుండా కాపాడ బడుతాడు. కాని ఈ మార్గంలో చాలా బద్ధకంతో అడుగులు వేయు వ్యక్తి, నిష్టాపరతను పూర్తిగా అనుసరించని వ్యక్తి, లేక ప్రపంచంలో మునిగిపోయినటు వంటి వ్యక్తి వారికి వారే సమస్యలను కొని తెచ్చుకొను వారగుదురు. అన్ని కోణాల నుండి దేవున్ని పట్ల విధేయతను చూపండి. బైఅత్ చేసిన వారిలో తమను తాము పరిగణించుకొను ప్రతి వ్యక్తి తన ఆధాయంతో ఈ జమాఅత్‌కు సేవచేయు సమయమిది. ఏ వ్యక్తి అయినా ఒక్క పైసా చెల్లించు స్థోమతను కల్గియున్నచో అతడు క్రమం తప్పకుండా ప్రతి నెల ఒక్క పైసాను ఈ జమాఅత్‌కు చెల్లించండి. ఎందుకనగా ఆతిథ్య గృహ ఖర్చులే గాకుండా ధార్మిక నిర్వాహణ ఖర్చులు కూడ పెరిగిపోతున్నాయి. వందల సంఖ్యలో అతిథులు వస్తున్నారు. కాని మన వద్ద తగినంత ధనం లేకపోవడం వలన నేటి వరకు అతిథుల కోసం ఒక ఆతిథ్య గృహాన్ని నిర్మించలేక పోయాము. అదే విధముగా మంచాలు కూడ లేవు. మస్జిద్‌ను కూడ పెంచవలసి ఉన్నది. వ్యతిరేకుల ఆరోపణలను ఖండించుటకు రచనలు, ప్రచురణలు కూడ చాలా తక్కువ స్థాయిలోనే జరుగుచున్నాయి. క్రైస్తవులు 50వేల సంఖ్యలో ప్రతులనే గాకుండా ధార్మిక పత్రికలను కూడ ప్రచురిస్తున్నారు. కాని మనం ప్రతి నెల వెయ్యి ప్రతులను కూడ ప్రచురించలేక పోవుచున్నాము. బైఅత్ చేసిన ప్రతి వ్యక్తి ఈ అంశాలను దృష్టియందుంచుకొని తమ స్థోమత మేరకు సహాయాన్ని అందించాలి. అప్పుడే దేవుడు కూడ వారికి సహాయంను అందించును. గుర్తుకు వచ్చినప్పుడే నగదును పంపిస్తూ చేసే సహాయం కన్న క్రమం తప్పకుండా ప్రతినెల సాధ్యమైనంత మేరకు చేసే చిన్న సహాయమే చాలా గొప్పది. ప్రతి వ్యక్తి యొక్క స్వచ్ఛత వారి సేవల ద్వారానే గుర్తించ బడుతుంది. ఓ ప్రియులారా! ధర్మము మరియు ధార్మిక లక్ష్యయాల కొరకు సేవ చేయు సమయమిది. ఈ అవకాశాన్ని అదృష్టంగా భావించండి. ఇలాంటి అవకాశం మరల ఎన్నడు లభించదు. కావున జకాత్ చెల్లించువారు తప్పకుండా ఇక్కడికి జకాత్‌ను పంపించగలరు. ప్రతి వ్యక్తి తన వృధా ఖర్చులను తగ్గించుకొని, పొదుపుగాబడిన ధనమును దైవ మార్గంలో ఖర్చు చేయండి. ఏది ఏమైనప్పటికి మీ నిజాయితిని నిరూపించుకోండి. ఫలితముగా అనుగ్రహం మరియు పరిశుద్ధ ఆత్మల బహుమతులను కూడపొందగలరు. ఎందుకనగా ఈఅ బహుమతులు ఈ జమాఅత్‌లో చేరునట్టి వారి కొరకే సిద్ధం చేయబడ్డాయి. మన దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరించిన పరిశుద్ధాత్మ యొక్క కాంతి ఇతర అన్ని కాంతుల కంటే చాలా గొప్పది. పరిశుద్ధాత్మ కొన్ని సందర్భాలలో పావురం రూపంలో బహిర్గతమైనది. మరి కొన్ని సందర్భాలలో కొంత మంది అవతార పురుషులకు, ప్రవక్తలకు ఆవు రూపంలో బహిర్గతమైనది. మరి కొందరికి తాబేలు లేదా చాప రూపంలో బహిర్గతమైనది. పరిపూర్ణ మానవుడు అనగా మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అవతరించనంత వరకు ఆ పరిశుద్ధాత్మ మానవరూపంలో బహిర్గతం కాలేదు. కాని పరిపూర్ణ మానవుడైన ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అవతరించగానే పరిశుద్దాత్మ కూడ మానవరూపంలో బహిర్గతమైనది. పరిశుద్దాత్మకు అద్భుత శక్తులు న్నందున అది భూమ్యాకాశపు అంచులను తన శక్తులతో నింపడం ద్వారా ఖుర్ఆన్ బోధనలు అన్యారాధన నుండి కాపాడబడినాయి.

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు

(2500) హజ్రత్ ఉక్బా బిన్ ఆమిర్ రజియల్లాహ్ ఇలా ఉల్లేఖించారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారికి కొన్ని మేకలను ఇచ్చి, వాటిని హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి అనుచరులలో పంచిపెట్టమని చెప్పారు. ఆ మేకలు ఖుర్బాని ఇవ్వడానికి నిర్ణయించబడినవి. వాటిలో 1సం॥నకు చెందిన ఒక మేక కూడ గలదు. ఆ విషయాన్ని హజ్రత్ ఉక్బా రజి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలుపగా హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం " ఆ మేకను నీవు ఖుర్బాని ఇచ్చుకో" అని వారితో అన్నారు.

(2501) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ హష్షామ్ ఇలా ఉల్లేఖించారు. వారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కాలంను పొందారు. వారి తల్లిగారైన హజ్రత్ జైనబ్ బిన్తె హమీద రజి గారు వారిని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు తీసుకవెళ్ళేవారు. (హజ్రత్ జైనబ్ రజి) ఇలా అన్నారు: ఓ రసూలుల్లాహ్! ఈ బాలుడి నుండి కూడ బైఅత్ తీసుకోండి. అందుకు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం "అతడు బాలుడే కదా!" అని చెప్పి, ఆపై హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ బాలుడి తలపై చేతిని నిమరుతూ అతని కోసం దుఆ చేశారు.

హజ్రత్ ఉమ్మే సల్మా రజి ఇలా ఉల్లేఖించారు: నేను అనారోగ్యముగా ఉన్న విషయాన్ని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలియ జేయగా, ఒంటెపై కూర్చొని ప్రదక్షణలు చేయమని హుజూర్ (స) అదేశించారు. అలా నేను ప్రదక్షణలు పూర్తి చేశాను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖానా కాబా ప్రక్కన నమాజ్ చదువుచున్నారు. హుజూర్ (స) **వత్తూరి వ కితాబిన్ మస్తూరిన్** పఠించారు. (బుఖారి)

**(సహి బుఖారి, కితాబుల్ షిర్కత్, సంపుటి 4, ప్రచురణ 2008, ఖాదియాన్. )**

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

# జుమా ప్రసంగము

హజ్రత్ ఫాతిమా రజి గారి వివాహం హజ్రత్ అలీ రజితో జరిపించాలని ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ముందుగానే దైవవాణి ద్వారా సూచన అందినది.

ఒకవేళ ఏ మహిళ అయినా తన భర్త అవిశ్వాసుడైనందుకు అతని నుండి దూరముగా ఉన్నచో ఆ భర్త విశ్వసించిన తరువాత మరల వారు నిఖా చేసుకోకుండానే వైవాహిక జీవనాన్ని ప్రారంభించవచ్చును.

అల్లాహుమ్మ ఇన్ని ఉ ఈజ్‌హోబిక వ జుర్రియ్యతహో మినష్షైత్తా నిర్రజీమ్.
అనగా: ఓ అల్లాహ్ ! వారిని మరియు వారి సంతానాన్ని తిరస్కరించబడిన షైతాన్ నుండి నీ అభయంలోకి తీసుకొనుము.

అల్లాహుమ్మ బారిక్ ఫీహిమా వ బారిక్ ల హుమా ఫి షమ్‌లిహిమా
ఓ అల్లాహ్! ఆ ఇరువురిని ఆశిర్వదించుము. వారి ఇరువురి కలయికను కూడ శుభప్రదము చేయుము.

అల్లాహుమ్మ బారిక్ ఫీహిమా వా బారిక్ అలైహిమా వా బారిక్ లహుమా నస్‌లహుమా
ఓ అల్లాహ్ ! ఆ ఇరువురి అనుబంధాలను శుభప్రదము చేయము, ఇతరులతో వారు కొనసాగించు సత్సంబంధాలను కూడ శుభ ప్రదము చేయుము, వారికి శుభప్రదమైన సంతానాన్ని అనుగ్రహించుము.
ఈ దుఆను తల్లి దండ్రులు నూతన వదువు వరుల కోసం చేయవలెను.

నేటి కాలంలో వివాహం అనంతరం భార్యాభర్తల మధ్య తలెత్తు నట్టి సమస్యలు ఇంకా కాస్తా ఎక్కువవుతూనే ఉన్నాయి. అందుకు కారణం ప్రాపంచిక వైభవాలు, సౌకర్యవంతమైన ఆలోచనలు. ఇవి రోజు రోజుకు ఎక్కువ అవుతూనే ఉన్నాయి. ధర్మము మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ఆజ్ఞలపై తక్కువ దృష్టి పెట్టడం వల్ల ఇలా జరుగుతుంది. వారు తమ విశ్వాసానికి ప్రాధాన్యతనిస్తూ, ఈ విధంగా ప్రార్థిస్తే, తల్లిదండ్రులు కూడా తమ బాధ్యతలను ఈ విధంగా నిర్వర్తిస్తే, అప్పుడు ఏ సందర్భంలోనైనా వివాహాలు చెక్కుచెదరకుండా ఉంటాయి.

"హజ్రత్ ఫాతిమ రజి కు ఒక సేవకుని అవసరం ఉన్నప్పటికీ, మరియు విసురు రాయి విసరడం వల్ల వారి చేతులు నొప్పి పెడుతున్నా కూడ హుజూర్ (స) వారికి సేవకుడిని ఇవ్వకుండా ఉండడం, పైగా వారికి దుఆలను చేయాలని చూసించడం, వారి దృష్టిని అల్లాహ్ తాలా వైపు మళ్ళించడంను చూసినచో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సంపదను చాలా జాగ్రత్తగా పంచిపెట్టేవారనే విషయం" ఈ సంఘటన ద్వారా తెలుస్తుంది.

ముస్లిం దేశాలు ప్రపంచంను వినాశనం నుండి కాపాడుటకు పూర్తి స్థాయిలో తమ వంతు ప్రయత్నం చేయాలి.

మనం మాత్రం దుఆలపై దృష్టి పెట్టాలి. అల్లాహ్ ఈ యుద్ధానికి ముగింపు చేయుగాకా!. అల్లాహ్ అమాయక పాలస్తీనియన్లను రక్షించి వారిని కాపాడుగాకా!. క్రూరత్వం నుండి వారిని రక్షించుగాకా! అన్యాయాన్ని ప్రపంచం నుండి అంతం చేయాలి. అది ఎక్కడ ఉన్నా నిర్మూలించాలి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు ప్రార్థన చేసే సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా!. (ఆమీన్).

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 20 అక్టోబర్ 2023 ( 20 ఇఖా 1402) మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్ టెలిఫోర్డ్, యు.కే లో ప్రసంగించిన జుమా ప్రసంగం.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُولُهٗ
أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيمِ
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔
اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔
صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

ఈ రోజు కూడ నేను బదర్ యుద్ధం తరువాత వెంటనే జరిగిన మరికొన్ని సంఘటనలను ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్రను ఆధారను చేసుకొని వివరిస్తాను. చరిత్రలో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లుడు అబూల్–ఆస్ రజి ఇస్లాంను అంగీకరించు ఆంశంను ఈ విధముగా పొందుపరిచారు. ఆం హజ్రతంస సల్లల్లాహు అలైహి వసల్లం హిజ్రి 6వ సంవత్సరపు జమాదిఉల్ ఊలా మాసంలో జైద్ బిన్ హారిస్ రజి నాయకత్వంలో ఈయిస్ అనే ప్రాంతానికి ఒక సైనిక బృందాన్ని పంపించారు. ' ఈయిస్ అనే ఈ ప్రాంతం మదీనా నుంచి నాలుగు రోజుల ప్రయాణ దూరంలో ఉంది. దూరాన్ని రోజుల రూపంలో పేర్కొన్నప్పుడు, ఒక రోజు ప్రయాణం 12 మైళ్లని కలిగి ఉంటుందని చరిత్రకారులు చెబుతారు. అలాగే, ఈ ప్రదేశం మదీనా నుండి 48 మైళ్ల దూరంలో ఉంది. ఈ ప్రయాణానికి సంబంధించిన కొన్ని వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హిజ్రి 6వ సంవత్సరం, జుమాదిల్–ఉలా మాసంలో జైద్ బిన్ హరిస రజి ఆధ్వర్యంలో 70 మంది సహచరులతో కూడిన సైనిక బృందాన్ని సిద్ధం చేశారు. ఈ సైనిక బృందం యొక్క ఉద్దేశ్యం ఏమిటంటే, మక్కా ఖురైష్‌లకు చెందిన ఒక వ్యాపార బృందం సిరియా నుండి వస్తున్నట్లుగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు సమాచారం అందించబడింది. అందువల్ల, హుజూర్ (స) ఈ బృందాన్ని పంపారు. అట్టి వాణిజ్య బృందం యొక్క లక్ష్యమేమనగా, వచ్చిన లాభాలతో ముస్లింలపై దాడి చేయడం, ఎదురుపడినచో యుద్ధం ప్రారంభించడం. కావున సహచరుల బృందం వారి వ్యాపార బృంధాన్ని అడ్డుకొని వారి నుండి వారి వస్తువులను స్వాధీనం చేసుకుంది. కొంతమందిని ఖైదీలుగా కూడా పట్టుకున్నారు. ఈ ఖైదీలలో అబూల్–ఆస్ కూడా ఉన్నాడు. (షరఅ జర్కాని అలల్ మవాహిబ్ లిద్దుని సంపుటి 3, పుట 124–125, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ం 1996) ( ఉర్దూ నిఘంటువు, సంపుటి 17, పుట 772, పద అర్థం మర్‌హలా.)

సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స)లో హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ రజి గారు ఇలా వ్రాసారు: "అబుల్–ఆస్ బిన్ రబీఅ కూడా 'ఈయిస్' ప్రాంతంలో పట్టుబడిన ఖైదీలలో ఉన్నాడు. అతను ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లుడు మరియు దివంగత హజ్రత్ ఖదీజా రజి గారి సమీప బంధువు.

ఇంతకు ముందు, అతను బదర్ యుద్ధంలో కూడా పట్టుబడ్డాడు, అయితే అతను మక్కా చేరుకొనగానే హుజూర్ (స) కుమార్తె అయినా హ|జత్ జైనబ్ రజిను మదీనాకు పంపాలనే షరతుపై ఆం హ|జత్ సల్లల్లాహు అలైహి వసల్లం అతనిని విడుదల చేశారు. అబూల్-ఆస్ తన వాగ్దానాన్ని నెరవేర్చాడు కానీ వ్యక్తిగతంగా బహుదేవత ఆరాధుడిగానే ఉన్నాడు. జైద్ బిన్ హరిస్ రజి అతనిని పట్టుకుని మదీనాకు తీసుకువచ్చే సరికి రాత్రి అయింది, అయితే అతను హ|జత్ జైనబ్ రజికు 'నన్ను బంధించి ఇక్కడికి తీసుకువచ్చారు. వీలైతే, మీరు నా విడుదల కోసం ఏదైనా ఏర్పాటు చేస్తారో లేదో చూడండి.' అని ఒక సందేశాన్ని ఏదో విధముగా చేరవేశారు. ఉదయం వేళ ఆం హ|జత్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు అనుచరులు ఫజర్ నమాజ్ చదువుతున్నారు. హ|జత్ జైనబ్ రజి తన ఇంటిలో గట్టిగా ఇలా అన్నారు. 'ఓ ముస్లింలారా! నేను అబుల్-ఆస్‌కు అభయాన్ని ఇస్తున్నాను. ఆం హ|జత్ సల్లల్లాంహు అలైహి వసల్లం తమ నమాజ్‌ను పూర్తి చేసుకొని తమ అనుచరుల వైపు తిరిగి వారిని ఉద్దేశించి ఇలా అన్నారు. 'జైనబ్ చెప్పినా విషయాన్ని మీరు విన్నారు కదా! . దేవుని ప్రమాణం! నాకు ఈ విషయంలో ఎలాంటి ముందస్తు సమాచారం లేదు" ఆ విషయం గురించి నాకు ఏమాత్రం తెలియదు. " కానీ విశ్వాసుల సంఘం ఒకే స్ఫూర్తిని కల్గి ఉంటుంది. వారిలో ఏ ఒక్కరు అవిశ్వాసునికి అభయాన్ని ఇచ్చినా కూడ మిగిలిన వారు దానిని గౌరవించాలి. " మరల హుజూర్ (స) హ|జత్ జైనబ్ రజిను ఉద్దేశిస్తూ 'మీరు ఎవరికి అభయాన్ని ఇచ్చినా వారికి మేము రక్షణ కల్పిస్తాము' అని అన్నారు. ఆ సమయంలో అబూల్-ఆస్ నుండి సేకరించిన యుద్ధ సంపదను తిరిగి అతనికి ఇవ్వబడింది. ఆ తరువాత హుజూర్ (స) జైనబ్ రజి ఇంట్లోకి ప్రవేశించి, తన కుమార్తెతో ఇలా అన్నారు, 'అబూల్-ఆస్‌కు మంచి ఆతిథ్యం ఇవ్వవచ్చును, కానీ ఏకాంతంలో అతనిని కలవకూడదు. ఎందుకంటే ప్రస్తుత పరిస్థితులలో, మీరు అతనిని కలవడం చట్టబద్ధం కాదు.' కొన్ని రోజుల బస తర్వాత, అబూల్-ఆస్ మక్కాకు వెళ్ళాడు, కానీ ఈసారి మక్కాకు అక్కడే శాశ్వతంగా ఉండడం కోసం వెళ్ళలేదు. అతను త్వరగా తన వ్యవహారాలన్నింటిని పూర్తి చేసి, ఇక ఇస్లాంను స్వీకరించడం కోసం మరల మదీనాకు బయలుదేరాడు. ఆం హ|జత్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకొని ముస్లిం అయ్యాడు. అప్పుడు హుజూర్ (స) వారిని హ|జత్ జైనబ్ రజి వద్దకు మరల ఎలాంటి నికాహ్ లేకుండానే పంపారు. కొన్ని కథనాలలో హ|జత్ జైనబ్ రజి మరియు అబూల్-ఆస్ రజి గార్లకు మరల నికాహ్ చేసినట్లుగా పేర్కొనబడింది, కాని మొదటి కథనమే ఎక్కువ నమ్మదగినది మరియు ప్రామాణికమైనదిగా కనిపిస్తుంది. **(సీరత్ ఖాతము న్నబియ్యీన్ సల్లల్లాహు అలైహి వసల్లం హ|జత్ మిర్జా బషీర్ అహ్మద్ రజి ఎం.ఏ పుట 670-671)** నిఖా తప్పని సరి కాదు. ఒకవేళ ఏ స్త్రీ అయినా తన భర్త యొక్క అవిశ్వాసం కారణంగా విడిపోవాలని కోరుకుంటే, అతడు విశ్వసించినచో ఆ తర్వాత అట్టి వారికి మరల నికాహ్ చదవవలసిన అవసరం లేదనే విషయం అర్థ మవుతుంది.

హ|జత్ జైనబ్ రజి, తన భర్త ఇస్లాం స్వీకరించిన తర్వాత తర్వాత ఎక్కువ కాలం జీవించలేదు. హిజ్రి 8 వ సంవత్సరంలో మృతి చెందారు. హ|జత్ ఉమ్మే ఐమన్ రజి, హ|జత్ సౌదహ్ రజి, హ|జత్ ఉమ్మే సల్మా రజి, హ|జత్ ఉమ్మే 'అతియ్య రజిలు ఆం హ|జత్ సల్లల్లాహు అలైహి వసల్లం మార్గదర్శకత్వం ప్రకారం ఆమె మృతదేహానికి స్నానం చేయించారు.

(సిరు స్సహాబ, వాల్యూం. 6, పేజి. 90, దారుల్-ఇషాత్, కరాచీ, 2004)

హ|జత్ ఉమ్మే అతియా రజి ఇలా ఉల్లేఖించారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ కుమార్తే మృతదేహానికి స్నానం చేయించమని మార్గదర్శకం చేయుచూ ఇలా తెలిపారు. "ఆమె శరీరం యొక్క కుడి వైపు నుండి మరియు వజూ సమయంలో కడిగే శరీర భాగాల నుండి ఆమెకు స్నానం చేయించడం ప్రారంభించండి." మరొక కథనంలో, దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హ|జత్ ఉమ్మె 'అతియ్యా రజి ఇలా తెలుపుచున్నారు: " రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కుమార్తె జైనబ్ రజి మృతి చెందినప్పుడు, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: 'ఆమె శరీరాన్ని బేసి సంఖ్యలో, అంటే మూడు లేదా ఐదు సార్లు కడగండి. మరియు ఐదవ సారి కడిగిన తర్వాత కొంచెం కర్పూరం వేయండి. మరియు మీరు ఆమె శరీరాన్ని పూర్తిగా కడిగిన తర్వాత నాకు తెలియజేయండి." మరల వారు ఇలా తెలిపారు. "మేము హుజూర్ (స) కు తెలియజేసాము మరియు హుజూర్ (స) తన వస్త్రాన్ని మాకు ఇచ్చారు మరియు దానిని మృత దేహానికి వస్త్రముగా ఉపయోగించమని మాకు చెప్పాడు." (సాహిహ్ ముస్లిం, కితాబ్ అల్-జనాయిజ్, బాబ్ ఫి ఘుస్లీల్-మయ్యితి, హదీస్ 2173, 2176) ఆజార్ అనగా నడుము చుట్టు నట్టి వస్త్రం. దానిని ఇచ్చారు. షియార్ అనగా శరీరం చుట్టూ చుట్టునట్టి వస్త్రం. (లుఘత్ అల్-హదీస్, సంపుటి 2, పేజి. 486, నుమాని కుతుబ్ ఖానా, లాహోర్, 2005)

ఆ తరువాత, ఆం హ|జత్ సల్లల్లాహు అలైహి వసల్లం జనాజ నమాజ్‌ను చదివించారు. స్వయముగా సమాధిలోకి దిగి తన కుమార్తెను సమాధి చేశారు. హ|జత్ జైనబ్ రజికు ఇద్దరు పిల్లలు. కుమారుడిపేరు అలీ, కుమార్తే పేరు అమామా. ఒక కథనం ప్రకారం, అలీ తన బాల్యంలో మరణించినట్లు గలదు, కాని మరొక కథనం ప్రకారం, అతను యుక్త వయస్సు చేరుకున్నాడని గలదు. ఇబ్న్ అసాకిర్ మాత్రం అతను యర్మూక్ యుద్ధంలో అమరుడయ్యాడని, మక్కా విజయం సమయంలో, అతను ఆం హ|జత్ సల్లల్లాహు అలైహి వసల్లం వెనుకాల స్వారీ చేసినట్లు రాశారు.

(సీర్ -సహాబా, సంపుటి 6, పేజి. 90, దార్ అల్-ఇషాత్, కరాచీ, 2004)

హ|జత్ అమామా రజిను సంబంధించి, హ|జత్ ఫాతిమా రజి మరణం తరువాత, హ|జత్ 'అలీ రజి ఆమెను వివాహం చేసుకున్నట్లు వ్రాసారు (ఇబ్న్ సాద్, అల్-తబాఖతుల్-కుబ్రా, సంపుటి. 8, పేజి. 25, దార్ అల్-కుతుబ్ అల్-ఇల్మియా, బేహ్‌రూత్ 1990)

హ|జత్ అబూల్-ఆస్ రజి గారి వాణిజ్యం, వ్యాపారం అంతా మక్కాలో ఉంది అందువలన, వారు మదీనాలో ఉండలేకపోయాడు. కావున వారు ఇస్లాం స్వీకరించిన తరువాత ఆం హ|జత్ సల్లల్లాహు అలైహి వసల్లం నుండి అనుమతి తీసుకొని మక్కాకు తిరిగి వచ్చారు. మక్కాలో నివాసం ఉండడం వల్ల హిజ్రి 10లో హ|జత్ అలీ రజి ఆధ్వర్యంలో పంపబడిన సైనిక యుద్ధంలో తప్ప, మరేలాంటి సైనిక దండయాత్రలో పాల్గొనే అవకాశం హ|జత్ అబుల్ ఆస్ రజికు లభించలేదు. యెమెన్ నుండి తిరిగి వచ్చిన తరువాత, హ|జత్ అలీ రజి వారిని యెమెన్ గవర్నర్‌గా నియమించారు. హ|జత్ జైనబ్ రజి మరణం తరువాత, హ|జత్ అబూల్-ఆస్ రజి ఎక్కువ కాలం జీవించలేదు మరియు హిజ్రి 12వ సం॥ లో మరణించారు. (సీరే-సహాబా, సంపుటి 7, పుట 491, దార్ అల్-ఇషాత్, కరాచీ) (ఉసదుల్-ఘాబతు, సంపుటి 6, పేజీలు. 182-183, దార్ అల్-కుతుబ్ అల్-ఇలిమియా, బేహ్‌రూత్)

హ|జత్ మీర్జా బషీర్ అహ్మద్ రజి హ|జత్ అబూల్-ఆస్ రజి మరియు ఆం హ|జత్ఎం సల్లల్లాహు అలైహి వసల్లం అతని పట్ల ఈ క్రింది విధంగా సంతోషించారనే విషయాన్ని ప్రస్తావించారు: ' ఆం హ|జత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి అల్లుడు, అబూల్-ఆస్ బిన్ రబీఅ రజి హ|జత్ ఖదీజా రజి గారి సమీప బంధువు, అనగా ఆమె రజి మేనల్లుడు. అతను బహుదైవారాధకుడు అయినప్పటికీ, అతని భార్య పట్ల అతను చాలా ప్రేమానురాగాలతో వ్యవహరించేవాడు. అతను ముస్లిం అయిన తర్వాత కూడా వారి భార్యాభర్తల వైవాహిక జీవితం ఆహ్లాదకరంగా ఉండేది. అందువల్ల, ఆం హ|జత్ సల్లల్లాహు అలైహి వసల్లం అతను తన కుమార్తేను చాలా గొప్పగా చూసుకుంటున్నాడని అబూల్-ఆస్ రజి ను తరచుగా ప్రశంసిస్తూ ఉండేవారు. అబూ ల్-ఆస్ రజి హిజ్రి 12వ సం॥లో హ|జత్ అబూబకర్ రజి గారి ఖిలాఫత్ కాలంలో మృతి చెందారు. కాని వారి గౌరవనీయమైన భార్య మాత్రం ఆం హ|జత్ సల్లల్లాంహు అలైహి వసల్లం జీవితకాలంలోనే మృతి చెందినది. " ఈ క్రమంలో చూసినచో హ|జత్ అలీ రజి అతనిని గవర్నర్‌గా నియమించారనే కథనం కొద్దిగా సందేహాస్పదంగా ఉంది. "ఆం హ|జత్ సల్లల్లాహు అలైహి వసల్లం కు మిక్కిలి ప్రియమైన వారి కుమార్తె అమామాను మాత్రం హ|జత్ ఫాతిమహ్ రజి మరణానంతరం హ|జత్ అలీ రజి వివాహం చేసుకున్నారు, కానీ వారి ద్వారా పిల్లలు కల్గలేదు. " (సీరత్ ఖాతమున్నబియ్యీన్ సల్లల్లాహు అలైహి వసల్లం రచయిత హ|జత్ సాహెబ్జాదహ్ మిర్జా బషీర్ అహ్మద్ రజి ఎం.ఏ పుట 674)

సావిక్ యుద్ధం హిజ్రి 2వ సం॥ జుల్ హజ్జ్‌లో జరిగింది. సావిక్ యుద్ధానికి కారణం ఏమిటంటే, విగ్రహారాధకులు బదర్ యుద్ధంలో ఓడిపోయి, దుఃఖంతో మక్కాకు తిరిగి వెళ్ళిన అబూ సుఫ్యాన్, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు అనుచరులతో బదర్ యుద్ధ ప్రతీకారం తీర్చుకునేంత వరకు తాను తన తలకు నూనెను పెట్టుకోనని, అసలు స్నానమే చేయనని శపథం చేశాడు. ఒక కథనం ప్రకారం, అబూ సుఫ్యాన్ తన శపథాన్ని నెరవేర్చడానికి 200 మంది సైనికులతో, మరొక కథనం ప్రకారం, 40 మంది సైనికులతో మక్కా నుండి బయలుదేరాడు. ఈ క్రమంలో అతను మదీనాకు వెళ్ళే సాధారణ మార్గంలో ప్రయాణించకుండా బదులుగా నజద్ మార్గం వైపు వెళ్ళాడు. అతను కినాద్ లోయ శిఖరానికి చేరుకొని, మదీనా నుండి దాదాపు 12 మైళ్ల దూరంలో ఉన్న యతిబ్ పర్వతానికి సమీపంలో

శిబిరాన్ని ఏర్పాటు చేశాడు. మదీనా మరియు ఉహుద్ మధ్య ఉన్న మదీనాలోని మూడు ప్రసిద్ధ లోయలలో కినాద్ ఒకటి. అతను రాత్రి బయలుదేరాడు మరియు రాత్రి చీకటిలో బనూ నజీర్ తెగ వారి వద్దకు చేరుకున్నాడు. హుయ్యయ్ బిన్ అఖ్తాబ్ వద్దకు చేరుకున్న అతను అతని తలుపు తట్టాడు, కానీ అతను తలుపు తెరవడానికి నిరాకరించాడు. అందువలన అబూ సుఫ్యాన్ సల్లాం బిన్ మిష్కం వద్దకు వెళ్లాడు, అతను ఆ సమయంలో బను నజీర్ తెగకు ప్రధాననాయకుడిగా మరియు కోశాధికారిగా కొనసాగుచున్నాడు. అబూ సుఫ్యాన్ ప్రవేశించడానికి అతని అనుమతి కోరాడు మరియు అందుకు అతను అనుమతిని ఇచ్చాడు. పైగా అతనికి ఆతిథ్యం ఇచ్చాడు, ఆహారం మరియు పానీయాలను అందించాడు . ఆ తరువాత అతడు ముసల్మానుల మరియు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం రహస్య విషయాలను చెప్పాడు. అనగా హుజూర్ (స)దిన చర్యలను గూర్చి చెప్పాడు. హుజూర్ (స) ఏ సమయంలో ఏం చేస్తారు?, ఎక్కడ ఉంటారు? అనే విషయాలను తెలియజేసాడు. అబూ సుఫ్యాన్ రాత్రి చివరి భాగం అనగా తెల్లవారు జాములో అక్కడి నుండి బయలుదేరి తన సహచరుల వద్దకు తిరిగి వచ్చాడు. తర్వాత అతను ఖురైష్‌లకు చెందిన కొంతమంది వ్యక్తులను మదీనా శివార్లలోని 'ఉరైజ్' అనే ప్రదేశానికి పంపాడు. 'ఉరైజ్ మదీనాకు మూడు మైళ్ల దూరంలో ఉన్నటు వంటి ఖర్జూర తోట. వారు అక్కడ అనేక ఖర్జూర తోటలను తగలబెట్టారు. మరియు ఒక అన్సారీ వ్యక్తిని, అతని సహాయకుడిని చంపారు. ఒక కథనంలో ఆ అన్సారి పేరు హజ్రత్ మఅబద్ బిన్ అమర్ రజి అని పేర్కొనబడి యున్నది. ఆ తరువాత అబూ సుఫ్యాన్ తన ప్రతిజ్ఞ నెరవేరిందని భావించాడు. ఎందుకనగా అతడు పై విధముగా నష్టాన్ని కల్గించాడు. కొంత అయినా ప్రతీకారం తీర్చుకున్నాను అని భావించాడు. అలా అతని ప్రతీకారపు జ్వాల కొంతవరకు తగ్గిన తరువాత అతను తన సైన్యంతో మక్కాకు తిరిగి వచ్చాడు. అబూ సుఫ్యాన్ సల్లాం బిన్ మిష్కమ్‌ను కలిసిన తర్వాత తిరిగి వచ్చిన రాత్రియే ఈ పనికి పాల్పడ్డాడని కూడా పేర్కొనబడింది.

ఏది ఏమైనప్పటికీ, ప్రజలకు ఈ విషయం తెలియగానే, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అబూ లుబాబా బషీర్ బిన్ అబ్దుల్-ముంజిర్ రజిను మదీనాకు తమ ఉపపర్యవేక్షడిగా నియమించారు. మరియు హిజ్రత్ చేసిన తర్వాత 22వ నెలలో ఆదివారం జుల్-హజ్జా 5వ తేదీన బయలుదేరారు. ముహజిర్ మరియు అన్సార్ల నుండి 200 మంది సహచరులతో హుజూర్ (స) వారిని వెంబడించుటకు బయలు దేరినారు. అలా హుజూర్ (స) ఖర్కరతుల్-కుద్ర వరకు చేరుకున్నారు. మదీనా నుండి 96 మైళ్ల దూరంలో ఉన్న ఈ కుద్ర ప్రాంతం మఅదన్ శివార్లలోని అర్-హజియ్యత్ సమీపంలోని ఉన్నది. ఇది బనూ సులైమ్‌కు నీరందించే ప్రదేశం అని కూడా పేర్కొనబడింది.

ఏది ఏమైనప్పటికీ, అబూ సుఫ్యాన్ మరియు అతని సైన్యం నిశ్శబ్దంగా పారిపోతూనే ఉన్నారు మరియు వారి భోజన సదుపాయం అయిన బార్లీ సంచులను విసరడం కొనసాగించారు. ముస్లింలు వాటిని తీయడం కొనసాగించారు, అందుకే దీనిని ఘజ్వా సావిక్ అని పిలుస్తారు, ఎందుకంటే ఇది బార్లీ యొక్క ఘజ్వా. అరబిక్‌లో బార్లీ అంటే సావిక్.

అబూ సుఫ్యాన్ మరియు అతని సైన్యం పారిపోయారు, మరియు ముస్లింలు వారిని పట్టుకోలేకపోయారు. కావున రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాకు తిరిగి వచ్చారు. అనుచరులు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి వస్తున్న సమయంలో కొందరు అనుచరులలు ప్రవక్తతో పాటు సహచరులు తిరిగి వస్తున్నప్పుడు, "ఓ అల్లాహ్ ప్రవక్తా(స), మీ దృష్టిలో ఇది యుద్ధంగా పరిగణించబడుతుందా?" అని అడిగారు. దానికి హుజూర్ (స) "అవును" అని బదులిచ్చారు.

. (సుబులుల్-హుదా వా అల్-రషద్, సంపుటి. 4, పేజి. 174, దార్ అల్-కుతుబ్ అల్-ఇల్మియా,బెహ్‌రూత్ 1993) ( ఇబ్న్ సాద్, అల్-తబాకత్ అల్-కుబ్రా, సంపుటి. 2, పేజీలు. 22- 23, దార్ అల్-కుతుబ్ అల్-ఇల్మియా, బేహ్‌రూత్ 1990) ( అల్లామా షిబ్లీ నుమాఅనీ, సిరతు-న్నబీ సల్లల్లాహు అలైహి వసల్లం సంపుటి 1, పేజి 211) (సిరత్ ఎన్‌సైక్లోపీడియా, సంపుటి 6, పేజీలు. 55-56) (ఫర్హాంగ్-ఇ- సీరత్, పేజీ. 234, 239, 242, ప్రచురణజవార్ అకాడమీ, కరాచీ)

ఇరుపక్షాల మధ్య పోరాటం జరిగినా, జరగకపోయినా ఇది ఒక యుద్ధంగానే పరిగణించబడింది.

ఈ ఘటనను గూర్చి పూర్తిగా విపూలికరించి సీరత్ ఖాతమున్నబియ్యీన్‌లో ఈ క్రింది విధంగా పేర్కొనబడింది: "బదర్ యుద్ధం తర్వాత, అబూ సుఫ్యాన్ ఈ విధముగా అనగా బదర్‌లో చనిపోయిన వారి తరుపున ప్రతీకారం తీర్చుకునేంత వరకు, తన భార్యతో సంబంధాలు పెట్టుకోను, మరియు జుట్టుకు నూనె రాసుకోవడం మానుకుంటానని ప్రమాణం చేశాడు. కావున బదర్ యుద్ధం జరిగిన 2, 3 నెలల తర్వాత జుల్-హజ్జా మాసంలో, అబూ సుఫ్యాన్ ఖురైష్‌లతో కూడిన రెండు వందల మంది సాయుధ బలగాలతో మక్కా నుండి బయలుదేరి నజద్ మార్గం గుండా మదీనాకు దగ్గరగా ఉన్న ప్రదేశానికి చేరుకున్నాడు. అక్కడికి చేరుకున్న తర్వాత, అతను మదీనా నుండి కొంత దూరంలో తన సైన్యాన్ని విడిచిపెట్టి, రాత్రి చీకటి ముసుగులో, యూదు తెగకు చెందిన బను నజీర్ యొక్క ముఖ్యనాయకుడైన హుయ్యయ్ బిన్ అఖ్తాబ్ నివాసానికి చేరుకుని అతని సహాయం కోరాడు. అందుకు హుయ్యయ్ తన ఒప్పందం మరియు ప్రమాణం అతనికి గుర్తుంచుకున్నందున, అతను సహాయం చేయడానికి నిరాకరించాడు. " అతను ఒప్పందం చేసుకున్నందున, అతను సహాయం చేయలేదు మరియు అతనికి ఎటువంటి రక్షణ ఇవ్వలేదు. "అప్పుడు అబూ సుఫ్యాన్ రహస్యంగా సల్లాం బిన్ మిష్కం అనే బను నజీర్ యొక్క మరొక నాయకుని ఇంటికి వెళ్లి, ముసల్మానులకు వ్యతిరేకముగా అతని మద్దతు కోరాడు. ఆ దౌర్భాగ్యుడు తన ఒప్పందాలు మరియు ప్రమాణాలను ప్రక్కను పెట్టి చాలా ధైర్యంగా అబూ సుఫ్యాన్‌ను రాత్రికి అతిథిగా ఆహ్వానించాడు మరియు ముస్లింలకు సంబంధించిన రహస్య గూఢచారాన్ని అతనికి తెలియ చేశాడు. తెల్లవారక ముందే, అబూ సుఫ్యాన్ సెలవు తీసుకున్నాడు మరియు అతని సైన్యాన్ని చేరుకున్న తర్వాత, మదీనాకు సమీపంలో ఉన్న 'అరిజ్ అనే లోయపై దాడి చేయడానికి ఖురైష్‌ల బృందాన్ని పంపించాడు. ఇది ముస్లింలకు చెందిన జంతువులు మేపుకునే లోయ. ఇది మదీనా నుండి కేవలం మూడు మైళ్ల దూరంలో ఉంది. సల్లాం బిన్ మిష్కం ద్వారా అబూ సుఫ్యాన్‌కు ఈ విషయం తెలిసి ఉండవచ్చు. ఖురైష్‌ల బృందం 'అరిజ్ లోయకు చేరుకున్నప్పుడు, అదృష్టవశాత్తూ, ఆ సమయంలో, ముస్లింలకు చెందిన జంతువులు అక్కడ లేవు. కాని, అన్సార్లలో ఒక ముస్లిం మరియు అతని సహచరుడు ఆ సమయంలో అక్కడే ఉన్నారు. ఖురైషులు వారిద్దరినీ పట్టుకుని నిర్దాక్షిణ్యంగా హత్య చేశారు. తరువాత, వారు ఆ ప్రాంతంలోని ఖర్జూర తోటలను తగులబెట్టారు. అబూ సుఫ్యాన్ శిబిరానికి తిరిగి వచ్చే ముందు అక్కడ ఉన్న గృహాలు మరియు చిన్న గుడిసెలకు నిప్పు పెట్టారు. ఈ విజయాన్ని తన ప్రతిజ్ఞకు తగినట్లుగా భావించి, అబూ సుఫ్యాన్ సైన్యాన్ని తిరిగి రమ్మని ఆదేశించాడు.

మరోవైపు, అబూ సుఫ్యాన్ చేసిన దాడి గురించి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలియగానే, వారు వెంటనే తమ సహచరుల బృందంతో బయలుదేరారు. అబూ సుఫ్యాన్ తన ప్రతిజ్ఞ నెరవేర్చడాన్ని రహస్యముగా ఉంచడానికి ఇష్టపడలేదు కాబట్టి, అతడు చాలా వేగంగా పారిపోయాడు. ముస్లిం సైన్యం అతన్ని పట్టుకోలేకపోయింది. అంతిమంగా, కొన్ని రోజులు గైర్హాజరైన తర్వాత, ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాకు తిరిగి వచ్చారు." వారు రజి మరల ఇలా వ్రాసారు. "ఈ ఘజ్వాను సావిక్ యొక్క ఘజ్వా అని పిలుస్తారు, ఎందుకంటే అబూ సుఫ్యాన్ మక్కాకు త్వరగా పారిపోయినప్పుడు, అతను తన ఆహారాన్ని వదిలి పారిపోయాడు, ఇందులో ప్రధానంగా 'సావిక్' లేదా బార్లీ బస్తాలు ఉన్నాయి, ఇది అతడు కొంతవరకు ఆందోళనను మరియు భారాన్ని తగ్గించుకోవడానికి మాత్రమే చేశాడు. " (సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స) రచయిత హజ్రత్ం మిర్జా బషీర్ అహ్మద్ రజి. ఎం.ఏ పుట 453-454)

సావిక్ యుద్ధం హిజ్రి 4 వ సం॥లో ఉహుద్ యుద్ధం తర్వాత కూడా ఈ పేరుతో ఒక యుద్ధం జరిగిందని సావిక్ యుద్ధానికి సంబంధించి చెప్పబడింది. ఈ విధంగా, తబరి సావిక్ పేరుతో రెండు యుద్ధాలను పేర్కొన్నాడు:

ఒకటి ఉహుద్ యుద్ధానికి ముందు, దాని వివరాలు ఇప్పుడే చెప్పబడ్డాయి మరియు రెండవ యుద్ధం ఉహుద్ యుద్ధం తర్వాత. కాని సిరత్ ఇబ్న్ హిషామ్, సుబుల్ అల్-హుదా మొదలైన ఇతర చరిత్ర పుస్తకాలలో ఈ యుద్ధాన్ని ' బదరుల్-మవాయిద్' అని పేరుతో పొందుపర్చబడ్డాయి.

ఈ యుద్ధానికి సంబంధించిన కొన్ని వివరాలను కూడా సంక్షిప్తముగా అందిస్తాను. అబూ సుఫ్యాన్ ఉహుద్ రోజున తిరిగి వెళ్ళాలని భావించినప్పుడు, అతను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఉద్దేశించి ఇలా అన్నాడు: "మా మరియు మీ మధ్య ఒక సంవత్సరం తరువాత బద్రు స్సఫ్రఅలో పోరాడుదాము అని నేను ఒక ప్రతిజ్ఞ చేస్తున్నాను. బద్రుల్-సుఫ్రా అరబ్బులు ఒకచోట చేరి మార్కెట్లు ఏర్పాటు చేసుకునే ప్రదేశం. కాబట్టి, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ఉమర్ రజికు ఇలా ఆజ్ఞాపించారు, "సరే అని వారికి చెప్పండి, ఇన్షా అల్లాహ్. ." ఆ ఒప్పందంతో ప్రజలు ఎవరి

దారిన వారు వెళ్ళిపోయారు. ఈ విధంగా, ఉహుద్ వద్ద అబూ సుఫ్యాన్ మరియు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మధ్య జరిగిన ఈ ఒప్పందం ప్రకారం, హుజూర్ (స) ఒక సంవత్సర వ్యవధి గడిచిన తరువాత బదర్ వైపు బయలుదేరారు. అక్కడికి చేరుకున్న తరువాత, హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎనిమిది రాత్రులు విడిది చేసి, అబూ సుఫ్యాన్ కోసం వేచి ఉన్నారు. అబూ సుఫ్యాన్ మక్కా ప్రజలతో కలిసి మార్రు-జహ్రాన్ పొలిమేరలకు చేరుకొని మజన్నాలో బస చేశాడు. మజన్నా మక్కా నుండి కొన్ని మైళ్ల దూరంలో ఉన్న జబలుల్-అస్ఫర్ సమీపంలోని మార్రు-జహ్రాన్‌కు చెందిన ఒక నగరం. ఆ తరువాత, అతను కరువును సాకుగా చూపి, తన ప్రజలతో మక్కాకు తిరిగి వచ్చాడు. ముందుకు వచ్చే ధైర్యం అతనికి లేకుండెను. మక్కా ప్రజలు ఈ సైన్యాన్ని "సావిక్ సైన్యం" అని పిలవడం ప్రారంభించారు, ఎందుకంటే వారు అక్కడి నుండి వెళ్ళేటప్పుడు సావిక్ ధాన్యం పానీయం త్రాగుతూ వెళ్ళారు. (తారిఖ్ -తబరి, సంపుటి. 2, పేజి. 87, దార్ అల్-కుతుబ్ అల్-ఇల్మియా, బెహ్రూత్ 2012) (సుబులుల్-హుదా వా అల్-రషద్, సంపుటి 4, పేజి. 337, దార్ అల్-కుతుబ్ అల్-ఇల్మియా బెహ్రూత్ 1993) ( ఫర్హాంగ్-ఎ-సిరత్, పేజీ. 259, జవార్ అకాడమీ, కరాచీ)

మొదటి పండుగను గూర్చి ఈ విధముగా లిఖించబడింది. హిజ్రి 2 లో సావిక్ యుద్ధం నుండి తిరిగి వచ్చిన తరువాత, ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈద్ అల్-అజ్‌హాను చదివించారు. ఇది ముస్లింల మొదటి ఈద్ అల్-అజ్‌హా. జుల్ హిజ్జా 10వ తేదీన హుజూర్ సల్లల్లాహు అలైహివ సల్లం తమ సహచరులతో కలిసి మదీనా బయటికి వెళ్లారు. అక్కడ సామూహికమైన నమాజ్‌ను చదివారు. ఆ తరువాత తమ స్వహస్తాలతో ఒక జంతువును కూడా వధించారు. (దాయిరయే మారీఫ్, సిరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ (స) సంపుటి 6, పేజి. 362-363, ప్రచురణ దార్ అల్-మఆరిఫ్, లాహోర్, 2022)

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహివ సల్లం బను కైనుకా యుద్ధం నుండి మదీనాకు తిరిగి వచ్చిన తరువాత ఈద్ ఉల్ అజ్‌హా చదివాము అని ఒక కథనంలో పేర్కొనబడింది. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు సహచరులలో స్థోమత ఉన్నవారు జుల్ హజ్జా 10వ తేదినా జంతువును ఖుర్బాని ఇచ్చారు. హుజూర్ (స) తమ సహచరులతో ఈద్‌గా వద్దకు వెళ్లారు. అక్కడ హుజూర్ (స) మొదటి ఈద్ అల్-అజ్‌హా నమాజ్‌ను చదివించారు. హుజూర్ (స) తమ సహచరులను మదీనాలో నడిపించిన చదివించిన మొదటి ఈద్ అల్-అజ్‌హా ప్రార్థన అది. ఆ తరువాత హుజూర్ (స) తమ చేతులతో ఒకటి లేదా రెండు మేకలను కూడా వధించారు.

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ రజి ఇలా వివరిస్తున్నారు, " ఖైనుకా' యుద్ధం నుండి తిరిగి వచ్చిన తర్వాత, మేము జుల్-హజ్జా 10వ తేదీన ఖుర్బాని ఇచ్చాము. ముసల్మానులు చేసిన మొదటి ఖుర్బాని ఇది. మేము బను సలామా తెగలో ఖుర్బాని ఇచ్చాము. ఈ క్రమంలో నేను ఖుర్బాన్ చేయబడిన జంతువుల సంఖ్యను లెక్కించగా 17 ఖుర్బాని జంతువులు అని తెలాయి. (తారిఖ్-తబరి, సంపుటి 2, పేజి. 49, దార్ అల్-కుతుబ్ అల్-ఇల్మియా, బెహ్రూత్ 2012) ఇది తారిఖ్ అల్-తబరీ నుండి సేకరించిన ఆధారం.

హజ్రత్ మీర్జా బషీర్ అహ్మద్ రజి ఈ సంఘటన గురించి సీరత్ ఖాతమున్నబియ్యీన్(స)లో ఇలా వ్రాశారు: " ఆ సంవత్సరంలోనే, జుల్-హజ్జా నెలలో, రెండవ ఇస్లామిక్ పండుగ, అంటే, ఈద్ ఉల్-అజ్‌హా ప్రారంభమైనది. దీనిని ఇస్లామిక్ ప్రపంచం జుల్-హజ్జా 10వ తేదీన జరుపుకుంటారు. ఈ పండుగ రోజున ప్రతి స్వచ్ఛమైన ముస్లిం కేవలం నమాజ్ చదవడమే కాకుండా స్థోమత ఉన్న ప్రతి ముస్లిం తన పేరుతో ఒక జంతువును ఖుర్బాని ఇవ్వవలసి ఉంటుంది. ఆ ఖుర్బాని మాంసాన్ని తమ బంధువులు, స్నేహితులకు, పొరుగువారు మొదలైన వారికి పంచిపెట్టడం జరుగుతుంది. తాను కూడా ఆ మాంసంలో నుండి కొద్ది మాంసాన్ని భుజించవచ్చును. " హజ్రత్ మీర్జా బషీర్ అహ్మద్ రజి గారు చాలా వివరంగా చెప్పారు, తద్వారా ప్రజలు ప్రాథమిక బోధనల గురించి కూడా తెలుసుకోవచ్చు.

| | |
|---|---|
| **అహ్‌దీస్ బోధనలు** | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."** (కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |

దుఆ ఆశించువారు: ***Muhammad Nazeer Ahmad sb, Palakurthy, warangal, (Telangana)***

మొత్తానికి ఖర్బాని మాంసాన్ని పంపిణీ చేసే విధానం ఇది. ఈ క్రమంలోనే ఈద్ ఉల్ అజ్‌హా రోజున, మరియు ఆ తర్వాత రెండు రోజుల పాటు, మొత్తం ఇస్లామిక్ ప్రపంచం అంతటా అల్లాహ్ కొరకు లక్షలాది జంతువులను వధిస్తారు. ఈ విధముగా, ఈ త్యాగం ద్వారా, హజ్రత్ ఇబ్రాహీం (అ), హజ్రత్ ఇస్మాయిల్ (అ) మరియు హజ్రత్ హాజర (అ) చేసిన అద్భుతమైన త్యాగంను స్మరించుకోవడం జరుగుతుంది. ఇందుకు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి జీవితమే గొప్ప ఉదాహరణ. అంతేగాకుండా ప్రతి ముస్లిం తన ప్రియతమ నాయకులు మరియు ప్రవక్త మార్గంలో తన జీవితాన్ని, సంపదను మరియు తన ఆస్తులన్నింటినీ త్యాగం చేయడానికి కూడా సిద్ధంగా ఉండాలని ఉద్బోధించడం జరిగింది. ఈద్ ఉల్ ఫితర్ మాదిరిగానే, ఒక గొప్ప ఇస్లామిక్ ఆరాధన ముగింపు సందర్భంగా ఈ ఈద్‌ను జరుపుకుంటారు. ఆ ఆరాధన హజ్." (సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స) హజ్రత్ సాహెబ్జాదహ్ మిర్జా బషీర్ అహ్మద్ రజి. ఎం.ఏ పుట 454-455)

హజ్రత్ ఫాతిమా రజియల్లాహ్ తాలా అన్‌హా గారి నికాహ్ కూడ హిజ్రి 2 వ సం॥లో జరిగింది. హజ్రత్ అలీ రజి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను హజ్రత్ ఫాతిమా రజితో వివాహం చేసుకుంటాను అని అభ్యర్థించారు. అందుకు హుజూర్ (స) సంతోషంగా అంగీకరించారు. హజ్రత్ అనస్ రజి ఇలా ఉల్లేఖించారు. హజ్రత్ అబూ బకర్ రజి మరియు హజ్రత్ ఉమర్ రజి ఇద్దరూ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకొని హజ్రత్ ఫాతిమా రజిను వివాహం చేసుకుంటామని అభ్యర్థించారు. అయితే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ విషయంలో మౌనంగా ఉన్నారు. వారికి ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. కథనాలను మరింతగా పరిశీలిస్తే, హజ్రత్ ఉమర్ రజి ముందుగా మరియు హజ్రత్ అబూ బకర్ తరువాత ఈ అభ్యర్థన చేసారని, ఆ తరువాత హజ్రత్ అలీ రజి అభ్యర్థన చేశారని తెలుస్తుంది. మొత్తానికి హజ్రత్ అలీ రజి ఇలా వివరించారు. "నేను ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిదికి వెళ్లి హజ్రత్ ఫాతిమ రజితో నాకు వివాహం చేస్తారా? అని అడిగాను. అందుకు హుజూర్ (స) 'కట్నం కోసం ఏమైనా ఉందా?' అని అడిగారు. అప్పుడు నేను " నా గుర్రం మరియు కవచం నా దగ్గర ఉన్నాయని" సమాధానం ఇచ్చాను. మరల దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు, 'నీకు గుర్రం కావాలి, కావున కవచాన్ని అమ్మవచ్చును.' కాబట్టి, నేను నా కవచాన్ని 480 దిర్హమ్‌లకు అమ్మి, కట్నాన్ని ఇచ్చాను. మరొక కథనంలో ఇలా గలదు. హజ్రత్ అలీ రజి తన కవచాన్ని హజ్రత్ ఉస్మాన్ రజి విక్రయించారు. అయితే హజ్రత్ ఉస్మాన్ రజి ఆ కవచంకు మూల్యంను చెల్లించడమే కాకుండా, దానిని కూడ తిరిగి ఇచ్చారు. హజ్రత్ అలీ రజి తెలిపారు. "నేను ఆ నగదు మొత్తాన్ని తీసుకవచ్చి హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంకు అప్పగించాను. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం బిలాల్ రజికు ఒక పడికెడు నాణేములను ఇచ్చి పరిమళాన్ని కొనుగోలు చేసి తీసుకురావాలని ఆదేశించారు. అదే విధముగా కొంత మంది మహిళలకు హజ్రత్ ఫాతిమా రజి కోసం పెళ్ళి సామాగ్రిని ఏర్పాటు చేయమని ఆదేశించారు. కావున హజ్రత్ ఫాతిమా రజి కోసం ఖర్జూరపు బెరడుతో నిండిన పురుపు, మంచం మరియు తోలు దిండును సిద్ధం చేశారు. మహెర్ నగద్‌ను ఈ పద్ధతిలో కూడ ఉపయోగించవచ్చు. ఇలా కూడ ఖర్చు చేయవచ్చును. పెళ్లి జరిగిన తర్వాత మెహర్ ఇవ్వనవసరం లేదని కొందరు అంటున్నారు. కాని మెహర్ నగదుతోనే సామాగ్రిని కోనుగోలు చేసిన ఉదాహరణ మనకు ఇక్కడ కనిపిస్తుంది.

మరొక కథనం ప్రకారం, తన కుమార్తెను హజ్రత్ అలీ రజికు ఇచ్చి వివాహం చేస్తున్నప్పుడు, హుజూర్ (స) ఇలా అన్నారు, "నా ప్రభువు ఈ విధముగానే అమలు చేయమని నాకు ఆజ్ఞాపించాడు."

అప్పగింతల తరువాత,ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అలీ రజితో ఇలా అన్నారు, "ఫాతిమా మీ వద్దకు వచ్చినప్పుడు, నేను మీ వద్దకు వచ్చే వరకు మీరు ఆమెతో ఏమీ మాట్లకండి." హజ్రత్ అలీ రజి ఇలా తెలిపారు. హజ్రత్ ఫాతిమ రజి, హజ్రత్ ఉమ్మే ఐమన్ రజితో కలిసి

| | |
|---|---|
| **అహ్‌దీస్ బోధనలు** | **"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |

దుఆ ఆశించువారు: ***Muhammad Vazeer Ahmad sb Babu, C.C.Kunta, Zila Mahboobnagar, (Telangana)***

వచ్చారు. ఇంట్లో ఒక భాగంలో కూర్చున్నారు. "నేను కూడా మరొక భాగంలో కూర్చున్నాను". కొంత సమయానికే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహివ సల్లం వచ్చారు. ఆపై "నా సోదరుడు ఇక్కడే ఉన్నాడా?"అని అడిగారు. అందుకు ఉమ్మే ఐమాన్ రజి గారు, "మీరు 'తమ్ముడు' అంటున్నారు. మరి మీరు మీ కుమార్తెను వారికిచ్చి వివాహం చేశారు?" అని అడిగారు. అప్పుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అవును అని జవాబిచ్చారు, ఎందుకంటే అలాంటి బంధువుల మధ్య (అంటే, బంధువులు) వివాహాలు జరగవచ్చు. మొత్తానికి తోడబుట్టిన తమ్ముడు కాదు కావున. ఇలాంటి బంధుత్వంలో వివాహం జరుగవచ్చును. ఆ తరువాత దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇంట్లోకి ప్రవేశించి హజ్రత్ ఫాతిమ రజిను నీళ్ళు తీసుకురావాలని కోరారు. ఆమె లేచి నిలబడి ఇంట్లో నిల్వ ఉన్న నీళ్ల చెంబుతో నీళ్ళు తీసుకొచ్చింది. నీళ్ళు తీసుకుని నోటిలో కాసేపు ఉంచుకొని మళ్ళీ గిన్నెలోకి వేశారు. ఆతరువాత హజ్రత్ ఫాతిమ రజిను ముందుకు రమ్మని చెప్పారు. కావున వారు ముందుకు వచ్చారు. హుజూర్ (స) ఆమెపై మరియు ఆమె తలపై కొంచెం నీరు చల్లారు మరియు ఆమె కోసం దుఆలు చేస్తు ఇలా పలికారు. అల్లాహుమ్మ ఇన్ని ఉ ఈజ్‌హా బిక వ జుర్రియ్యతహా మినష్షైతాని ర్రజీమ్. ఓ అల్లాహ్!. నేను ఆమెను మరియు ఆమె పిల్లలను శాపగ్రస్తుడైన సాతాను నుండి నీ ఆశ్రయంలో ఉంచాను."

మరల దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం ఇలా అన్నారు: "ఇంకొక వైపు చూడు." ఆమె తిరిగినప్పుడు, హుజూర్ (స) ఆమె భుజాల మధ్య నీటిని చిలకరించారు, ఆపై హజ్రత్ అలీ రజికు కూడా అలాగే చేసారు. ఆపై హజ్రత్ అలీ రజిను ఉద్దేశించి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు, "అల్లాహ్ పేరు మరియు శుభములతో నీ భార్య వద్దకు వెళ్ళండి."

మరొక కథనంలో, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒక పాత్రలో నీటిని తెప్పించి వాటితో వజూ చేసుకున్నారు. ఆ తరువాత ఆ నీటిని హజ్రత్ అలీ రజి మరియు హజ్రత్ ఫాతిమ రజిపై చల్లి ఇలా చెప్పారు. అల్లాహుమ్మ బారిక్ ఫిహిమా వ బారిక్ లహుమా ఫి షమ్‌లిహిమా అనగా "ఓ అల్లాహ్, వారిద్దరినీ ఆశీర్వదించండి మరియు వారి సహవాసాన్ని ఆశీర్వదించండి."

హజ్రత్ ఆయిషా రజి మరియు హజ్రత్ ఉమ్మే సల్మా రజి ఇలా వివరిస్తున్నారు. " ఫాతిమ రజిను సిద్ధం చేసి హజ్రత్ అలీ రజి వద్దకు తీసుకురావాలని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మమ్ము ఆదేశించారు. కావున మేము ఇంటికి తిరిగి వచ్చాము. బాతా చుట్టుపక్కల నుండి తీసిన కొంత మెత్తని ఇసుకను (అంటే, వారు మొదట ఇంటిని సిద్ధం చేసారు), తరువాత ఖర్జూరపు బెరడుతో రెండు దిండ్లు నింపి, మా స్వంత చేతులతో వాటిని సిద్ధం చేసాము. మేము తినడానికి మరియు త్రాగడానికి ఖర్జూరాలు, ఎండుద్రాక్ష మరియు మంచినీళ్ళు ఏర్పాటు చేశాము. అదే విధముగా మేము బట్టలు వేలాడదీయడానికి గదికి ఒక వైపున కర్ర దిమ్మెలను కూడా ఏర్పాటు చేసాము. ఆపై దాని మీద నీటికోసం ఒక తోలు సంచిని వేలాడదీయడం జరిగింది.

మేము హజ్రత్ ఫాతిమా రజి వివాహం కంటే గొప్ప వివాహాన్ని చూడలేదు. వలీమా విందులో ఖర్జూరం, బార్లీ, మేక మాంసం, పన్నీరు మరియు (హీస్) మాంసంతో తయారు చేసిన పిండి వంటకాలు ఉన్నాయి. హీస్ అనేది ఖర్జూర పండ్లను శుభ్రం చేసి, వెన్న మరియు మేక మాంసం, పన్నీర్ కలిపి చేసే వంటకం. హజ్రత్ అస్మా బిన్త్ ఉమైస్ రజి ఇలా తెలిపారు. ఆ కాలంలో ఇదే అన్నిటి కంటే ఉత్తమమైన వలీమా విందు.

(షరఅ అల్లామా జర్కాని అలల్ మవాహిబ్ లిల్‌దని, సంపుటి 2, పుట 357-366, జికర్ తజ్‌రీజ్ అల బిఫాతిమతు దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 1996) (తారీఖుల్ ఖమీస్ భాగం 2, పుట 77, ఫిల్ వఖాఅ మిన్ అవ్వల్ హిజరతు సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా వఫాతహు దారుల్ కుతుబు ఇల్మియత్ బెహ్‌రూత్ 2009) (సునన్ ఇబ్నే మాజి, కితాబున్నిఖా, బాబుల్ వలీమతు హదీస్ సంఖ్య 1911) ( అత్తబ్ఖాతుల్ కుబ్రా, భాగం 8 పుట 19, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 1990) (లుఘతుల్ హదీస్ సంపుటి1, పుట 542, నుఅమాని కుతుబ్ ఖాని లాహెూర్ 2005)

ఈ వివాహం మరియు వలీమా విందు సరళతకు గొప్ప ఉదాహరణ. హజ్రత్ ఫాతిమ రజి మరియు హజ్రత్ అలీ రజి వివాహం గురించి సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స)లో చాలా వివరంగా ప్రస్తావించబడింది. ఇందులో కొన్ని అదనపు వివరాలు ఉన్నాయి, అవి ముఖ్యమైనవి, కాబట్టి నేను దీనిని కూడా ప్రస్తావిస్తాను. "హజ్రత్ ఫాతిమ రజి ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు హజ్రత్ ఖదీజా రజిలకు కల్గిన సంతానంలో చివరి సంతానం. హుజూర్ (స) హజ్రత్ ఫాతిమ రజిను తనకు అత్యంత ప్రియమైనదిగా భావించేవారు. ఆమె వ్యక్తిగత యోగ్యత కారణంగా, ఆమె నిస్సందేహంగా ఈ ప్రత్యేకమైన ప్రేమకు అత్యంత యోగ్యమైనది. ఇప్పుడు, ఆమె వయస్సు సుమారుగా పదిహేనుకు చేరుకుంది, అప్పుడే ఆమెకు పెళ్లి ప్రతిపాదనలు రావడం ప్రారంభించాయి. హజ్రత్ ఫాతిమ రజి కోసం అభ్యర్థన చేసిన మొదటి వ్యక్తి హజ్రత్ అబూ బకర్ రజి . కానీ ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం దాటవేశారు. అప్పుడు, హజ్రత్ ఉమర్ రజి ఒక ప్రతిపాదన చేసాడు, అప్పుడు కూడ అతని అభ్యర్థనను ఆమోదించలేదు. అప్పుడు ఆ ఇరువురు మహోన్నతులు ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అలీ రజికు ఇచ్చి వివాహం చేయాలనుకుంటున్నారని అర్థం చేసుకున్నారు. కావున ఈ గౌరవనీయులైన ఇద్దరు వ్యక్తులు హజ్రత్ అలీ రజిను సంప్రదించి, హజ్రత్ ఫాతిమ రజి కు సంబంధించి ప్రతిపాదన చేయమని ప్రోత్సహించారు. హజ్రత్ అలీ రజి బహుశా ముందునుండే ప్రతిపాదన చేయాలని భావించిన నిరాడంబరత వలన మౌనంగా ఉండిపోయారు. కావున వెంటనే ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకొని వివాహ ప్రతిపాదనను తెలియజేశారు. హజ్రత్ ఫాతిమ రజి వివాహం హజ్రత్ అలీ రజితో జరగాలని దైవవాణి ద్వారా ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు అప్పటికే సూచన అందింది. అందువల్ల, హజ్రత్ అలీ రజి వివాహ ప్రస్తావన చేయగానే హుజూర్ (స) ఇలా అన్నారు, 'ఈ విషయంలో నాకు ఇప్పటికే దైవ సూచన వచ్చింది.' అప్పుడు, హుజూర్ (స) హజ్రత్ ఫాతిమ రజి గారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. వారు సిగ్గు కారణంగా మౌనంగానే ఉండిపోయారు. " సమాధానం ఇవ్వలేదు కాని మౌనంగా ఉండిపోయారు. మరల ఇలా వ్రాసారు. " ఒక విధంగా, ఇది కూడ అంగీకార వ్యక్తీకరణయే. అందువల్ల, ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ముహాజిరిన్ మరియు అన్సార్లను సమావేశపర్చి, హజ్రత్ అలీ రజి మరియు హజ్రత్ ఫాతిమ రజి గార్ల వివాహాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సంఘటన హిజ్రి 2 వ సం॥ ప్రారంభంలో లేదా మధ్య కాలంలో జరిగింది, తరువాత, బదర్ యుద్ధం జరిగిన తరువాత సుమారు అదే సం॥ అనగా హిజ్రి 2వ సం॥, జుల్ హజ్జా నెలలో అప్పగింతల కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రతిపాదించారు. ఈ క్రమంలో ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అలీ రజిను పిలిచి మెహర్‌ను చెల్లించడానికి మీ వద్ద ఏమైన ఉన్నదా? లేదా? అని విచారించారు. అందుకు హజ్రత్ అలీ రజి ఇలా సమాధానం ఇచ్చారు. 'ఓ అల్లాసా ప్రవక్తా! నా దగ్గర ఏమీ లేదు.'. అప్పుడు హుజూర్ (స) "ఆ రోజు (అంటే బదర్ యుద్ధ సంపద నుండి) నేను మీకు ఇచ్చిన ఇనుప కవచ దుస్తువులు ఏవి? అని అడిగారు. అందుకు హజ్రత్ అలీ రజి స్పందిస్తూ, ' అది నా దగ్గర ఉన్నది' అని చెప్పారు. అప్పుడు హుజూర్ (స) 'అది సరిపోతుంది. దానిని తీసుకురండి.' అని అన్నారు. మొత్తానికి ఆ కవచాన్ని 480 దిర్హామ్‌లకు విక్రయించారు. ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ నగదుతో వివాహానికి కావలసిన అన్ని ఏర్పాట్లను చేశారు. ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ఫాతిమ రజికు ఇచ్చిన కట్నంను చూసినచో ఎంబ్రాయిడరీ దుప్పటి, చర్మంతో చేసిన పరుపు. అందులో ఖర్జూరపు ఎండు ఆకులను నింపడం జరిగింది. నీళ్ళ కోసం ఒక తోలు సంచి. హుజూర్ (స) హజ్రత్ ఫాతిమ రజికు కట్నంలో భాగంగాఒక విసురు రాయిని కూడా ఇచ్చారని మరొక కథనంలో చెప్పబడింది. ఈ వస్తువులను ఏర్పాటు చేసినతరువాత, ఉండడానికి ఇంటి అవసరం

**వర్తమాన ఖలీఫా వాఖ్యములు**

"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. "
(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*

**సాబిర్ బుర్ఖా హౌజ్ ఖాదియాన్**



**SABIR BURQA HOUSE**
**ALL TYPES OF READYMADE BURQA**

**ఫోన్ ద్వారా ఆర్డర్లు పంపినచో బుర్ఖాలు కొరియర్ ద్వారా కూడా పంపబడును**

CIVIL LINES ROAD, OPP: FOUR STORY QADIAN
CONTACT NO:98884 45694 (SABIR AHMAD)

ఏర్పడింది. అప్పటి వరకు, హజ్రత్ అలీ రజి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి బహుశా మసీదు పక్కన నిర్మించిన గదులలో నివసిస్తుండేవారు. కాని వివాహానంతరం భార్యాభర్తలు నివసించే ప్రత్యేక నివాసం అవసరం. అందువల్ల, ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అలీ రజి ను వారిద్దరూ నివాసం ఉండేందుకు ఒక ఇంటిని చూసుకొమ్మని ఆదేశించారు. హజ్రత్ అలీ రజి తాత్కాలికంగా ఒక ఇంటిని ఏర్పాటు చేశారు . మొత్తానికి హజ్రత్ ఫాతిమ రజి గారి అప్పగింతల కార్యక్రమము పూర్తి అయింది. అదే రోజు, రుఖ్సాతనా తర్వాత, ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి కొత్త ఇంటికి వెళ్ళారు. ఆపై కొన్ని నీళ్ళను తెప్పించి, ఆ నీటిపై దుఆ చేశారు. ఆ తరువాత హజ్రత్ ఫాతిమా రజి మరియు హజ్రత్ అలీ రజి ఇరువురిపై ఈ పదాలను పలుకుతూ ఆ నీటిని చల్లారు." ఇంతకు ముందే నేను ఆ దుఆను పఠించాను. అల్లాహుమ్మా బారిక్ ఫీహిమా వ బారిక్ అలైహిమా వ బారిక్ లహుమా నస్‌లహుమా . ఈ దుఆను వదువు వరుల తల్లిదండ్రులు కూడ నూతన దంపతుల కోసం పఠించాలి.

నేటి కాలంలో వివాహం అనంతరం భార్యాభర్తల మధ్య తలెత్తు నట్టి సమస్యలు ఇంకా కాస్తా ఎక్కువవుతూనే ఉన్నాయి. అందుకు కారణం ప్రాపంచిక వైభవాలు, సౌకర్యవంతమైన ఆలోచనలు. ఇవి రోజు రోజుకు ఎక్కువ అవుతూనే ఉన్నాయి. ధర్మము మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ఆజ్ఞలపై తక్కువ దృష్టి పెట్టడం వల్ల ఇలా జరుగుతుంది. వారు తమ విశ్వాసానికి ప్రాధాన్యతనిస్తూ, ఈ విధంగా ప్రార్థిస్తే, తల్లిదండ్రులు కూడా తమ బాధ్యతలను ఈ విధంగా నిర్వర్తిస్తే, అప్పుడు ఏ సందర్భంలోనైనా వివాహాలు చెక్కుచెదరకుండా ఉంటాయి.

ఈ ప్రార్థన యొక్క అర్థం: "ఓ నా అల్లా! వారిద్దరి పరస్పర సంబంధాలను శుభప్రదము చేయుము. మరియు ఇతరులతో ఏర్పడునట్టి వారి ఇద్దరి సంబంధాలను శుభప్రదము చేయుము. మరియు వారి సంతానాన్ని ఆశీర్వదించుము. ఆ తరువాత, హుజూర్ (స) ఆ కొత్త జంటను ఒంటరిగా వదిలి తిరిగి వచ్చారు. తరువాత, ఒక రోజు, ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ఫాతిమ రజి ను సందర్శించడానికి వచ్చారు. ఆ సమయంలో హజ్రత్ ఫాతిమా రజి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఇలా విన్నవించుకున్నారు. హరిస్ బిన్ నుమాన్ అన్సారీ రజికు కొన్ని గృహాలు ఉన్నాయని తెలిసింది. కావున మీరు వారిని మా కోసం ఒక ఇంటిని ఇవ్వమని అడిగి చూడండి. మేము ఆ ఇంటిలోకి మారుతాము. అలా మీకు కూడ దగ్గరిలో ఉంటాము. అందుకు హుజూర్ సల్లల్లాహు అలైహివ సల్లం ఇలా అన్నారు, 'అతను ఇప్పటికే మన కోసం చాలా ఇళ్లను ఖాళీ చేసి ఇచ్చాడు. ఇప్పుడు నేను అతనిని మరల అడగాలంటే నేను ఇబ్బందిపడుతున్నాను.' ఏదో ఒక విధంగా, హరిస్ రజి ఈ విషయం తెలుసుకున్నప్పుడు, అతను ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు పరుగెత్తుకుంటూ వచ్చి, "ఓ అల్లాహ్ యొక్క ప్రవక్తా! నా దగ్గర ఉన్నదాని కంటే నేను మీకు అంకితం చేసిన దానివలనే నాకు ఎక్కువ ఆనందం కలుగుతుంది. ఆ తరువాత ఆ స్వచ్ఛమైన అనుచరుడు పట్టుబట్టి తన ఇంటిలో ఒకదాన్ని ఖాళీ చేసి, దానిని హుజూర్ (స)కు సమర్పించాడు. అప్పుడు హజ్రత్ అలీ రజి మరియు హజ్రత్ ఫాతిమ రజి గార్లు ఆ ఇంటికి మకాం మార్చారు. (సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స) రచయిత హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ రజి ఎం.ఏ పుట 455-456)

కష్టతరమైన పరిస్థితులు మరియు పేదరికంలో ఉన్నప్పటికీ, హజ్రత్ అలీ రజి మరియు హజ్రత్ ఫాతిమ రజి భక్తి మరియు సంతృప్తిని ప్రదర్శించేవారు. ఒక హదీస్‌లో ఈ విధముగా గలదు. హజ్రత్ అలీ రజి ఇలా ఉల్లేఖించారు. హజ్రత్ ఫాతిమ రజి విసురు రాయి విసరడం వలన తన చేతులు నొప్పి పెడుతున్నాయని ఫిర్యాదు చేశారు. ఆ సమయంలోనే ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు కొంతమంది ఖైదీలను తీసుకువచ్చారని తెలిసింది. కావున ఆమె దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు చూడటానికి వెళ్ళింది, కానీ హుజూర్ (స) అక్కడ లేరు. ఆమె హజ్రత్ ఆయిషా రజి ను కలుసుకుంది. మరియు ఆమె వచ్చిన కారణం గురించి వారికి తెలియజేసింది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతిరిగి వచ్చినప్పుడు, హజ్రత్ ఫాతిమా రజి వచ్చిన విషయంను గురించి హజ్రత్ ఆయిషా రజి తెలియజేశారు. హజ్రత్ ఫాతిమ రజి ఇలా పేర్కొన్నారు, "మేము నిద్రించాలనుకుంటున్న సమయానికి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మమ్మల్ని పలకరించడానికి మా ఇంటికి వచ్చారు. వేము నిలబడుచుండగా కూర్చొమని అన్నారు. ఆ తరువాత హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం మా మధ్య కూర్చున్నారు. నా చాతి సమీపంలో ఉన్నటు వంటి హుజూర్ (స) పాదాల చల్లదనాన్ని నేను గ్రహించగలిగాను. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం ఇలా అన్నారు: 'మీరు కోరిన దానికంటే మెరుగైన విషయాన్ని నేను మీకు తెలియజేయకూడదా?. అదేమనగా మీరిద్దరూ మీ పడకలపై పడుకున్నప్పుడు, అల్లాహు అక్బర్ అనగా అల్లాహ్ గొప్పవాడు అని 34 సార్లు, సుబానల్లాహ్ అనగా అల్లాహ్ పవిత్రుడు అని 33 సార్లు మరియు అల్ హందులిల్లాహ్ అనగా అన్ని స్తుతులు అల్లాహ్‌కే చెందుతాయి అని 33 సార్లు పఠించండి. ఇది పనివారి కంటే మీ ఇద్దరికీ మేలు."

హజ్రత్ అబూ హురైర రజి ఇలా ఉల్లేఖించారు. హజ్రత్ ఫాతిమ రజి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వెళ్ళి ఒక బానిసను కావాలని కార్మికుడిని అభ్యర్థించారు. మరియు తన పనిలో గల అసౌకర్యం గురించి ఫిర్యాదు చేశారు. అందుకు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: "నీకు ఇక్కడ నుండి పనివాడు దొరకడు." మరల ప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం ఇలా అన్నారు: "కార్మికుడి కంటే మీకు మేలు చేసే విషయం గురించి నేను మీకు చెప్పకూడదా? మీరు పడుకోవడానికి విశ్రాంతి తీసుకున్నప్పుడు, సుభాహానల్లాహ్ 33 సార్లు, అల్హమ్దులిల్లాహ్ 33 సార్లు మరియు అల్లాహు అక్బర్ 34 సార్లు చదవండి. ఇది సహీహ్ ముస్లిం నుండి వచ్చిన కథనం. (సహీహ్ ముస్లిం, కితాబ్ అజిక్రీ వా అదు'ఐ వా తౌబతు,బాబ్ అత్-తస్బిహ్ అవ్వల్ అనహర్ వా 'ఇందా అన్-నమ్మ్, హదీస్ 6915, 6918)

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవితాన్ని ప్రస్తావిస్తూ, హజ్రత్ ముస్లేహ్-ఎ-మౌవూద్ రజి ఈ సంఘటనను సహీహ్ అల్-బుఖారీని ఆధారము చేసుకొని ఇలా పేర్కొన్నాడు: "హజ్రత్ ఫాతిమ రజియల్లాహు తాలా అన్హా విసురు రాయి విసరడం వలన చాలా ఇబ్బందిగా ఉన్నదని తెలిపారు. ఆ సమయంలో కొంతమంది ఖైదీలను ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న హజ్రత్ ఫాతిమా రజి హుజూర్ (స)తో మాట్లాడడానికి వెళ్ళారు. కానీ హుజూర్ (స) ఆ సమయంలో ఇంట్లో లేరు. కావున తన వచ్చిన పనిని గూర్చి వారు రజి హజ్రత్ ఆయిషా రజికు తెలియజేసి ఇంటికి తిరిగి వచ్చారు. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంల ఇంటికి తిరిగి వచ్చినప్పుడు, హజ్రత్ ఆయిషా రజి గారు హజ్రత్ ఫాతిమా రజి వచ్చిన విషయంను గురించి హుజూర్ (స)కు తెలియజేశారు. (హజ్రత్ ఫాతిమా రజి ఇలా తెలిపారు.) విషయం తెలుసుకున్న తరువాత హుజూర్ (స) మా ఇంటికి వచ్చారు. అప్పటికే మేము నిద్రపోవడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నాము. హుజూర్ (స) రావడాన్ని గమనించిన నేను లేచి నిలబడాలని చూశాను. కాని మీరు అలాగే ఉండండి అని హుజూర్ (స) అన్నారు. ఆపై హుజూర్ (స) మా ఇరువురి మధ్యలో కూర్చున్నారు. హుజూర్ (స) పాదాల చల్లదనాన్ని నేను నా ఛాతీ ద్వారా అనుభవించాను. హుజూర్ (స) మా ఇరువురి మధ్యలో కూర్చున్న తరువాత ఇలా అన్నారు. 'నువ్వు అడిగిన దానికంటే మంచి విషయం చెప్పనా? మీరు నిద్రించడానికి ముందు దేవుణ్ణి అల్లాహు అక్బర్ అని 34 సార్లు కీర్తించండి, సుభాహానల్లాహ్ అని 33 సార్లు మరియు అల్హమ్దులిల్లాహ్ అని 33 సార్లు పఠించండి. పనివాడి కంటే ఇదే నీకు మేలు చేస్తుంది." హజ్రత్ ముస్లేహ్-ఎ-మౌవూద్ రజి ఇలా పేర్కొన్నారు. "హజ్రత్ ఫాతిమ రజి కు ఒక సేవకుని అవసరం ఉన్నప్పటికీ, మరియు విసురు రాయి విసరడం వల్ల వారి చేతులు నొప్పి పెడుతున్నా కూడ హుజూర్ (స) వారికి సేవకుడిని ఇవ్వకుండా ఉ ండడం, పైగా వారికి దుఆలను చేయాలని చూసించడం, వారి దృష్టిని అల్లాహ్ తాలా వైపు మళ్ళించడంను చూసినచో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సంపదను చాలా జాగ్రత్తగా పంచిపెట్టేవారనే విషయం ఈ సంఘటన ద్వారా తెలుస్తుంది.

దైవ ప్రవక్త (స) కోరుకున్నచో హజ్రత్ ఫాతిమ రజికు ఒక పనివాడిని మంజూరు చేయగలరు. ఎందుకంటే హుజూర్ (స) వద్దకు వచ్చే సంపద కూడ సహచరుల మధ్యనే పంపిణీ చేయబడుతుండేది. కావున అట్టి సంపదలో హజ్రత్ ఫాతిమ రజి మరియు హజ్రత్ అలీ రజికు కూడా హక్కు దారులే. అయినా కూడ హుజూర్ (స) చాలా జాగ్రత్తగా వ్యవహరించారు. ఆ సంపదలో కొద్ది భాగాన్ని కూడ తనకు గాని లేదా తన బంధువులకు గాని ఇవ్వడానికి హుజూర్ (స) ఇష్టపడలేదు, ఎందుకంటే భవిష్యత్తులో కొందరు తప్పుడు తీర్మానాలు చేసి, రాజులు ప్రజల సంపదను తమ కోసం దాచిపెట్టు కోవడాన్ని సముచితమని భావించే అవకాశం ఉంది. (దురదృష్టవశాత్తూ, నేటి ముస్లిం పాలకులు దీనిని సముచితంగా భావిస్తారు.) అందువల్లనే ముందు జాగ్రత కోసమే హుజూర్ (స) తమ వద్దకు వచ్చిన బానిసలు మరియు బానిసరాళ్ళలో

ఏ ఒక్కరిని కూడ హజ్రత్ ఫాతిమ రజికు ఇవ్వలేదు.

ఇక్కడ గుర్తుంచుకోవలసిన మరొక విషయమేమనగా అల్లాహ్ తాలా ఏ సంపదలోనైతే హుజూర్ (స)కు మరియు హుజూర్ (స) బంధువుల కొరకు కొంత భాగాన్ని కేటాయించేవాడో ఆ సంపదలో నుండి హుజూర్ (స) తమ కోసం ఖర్చు చేసుకునేవారు మరియు తమ బంధువుల కోసం కూడ ఖర్చు చేసేవారు. ఎప్పటి వరకైతే హుజూర్ (స) భాగంలో ఏదైనా సంపద రానిచో అప్పటి వరకు మూల సంపదలో నుండి హుజూర్ (స) ఏ మాత్రం ఖర్చు చేసేవారు కాదు. తమ బంధువు మిత్రులకు ఇచ్చేవారు కాదు.

ఖజానాను అలా రక్షించే ఏ రాజునైన ప్రపంచం ఉదాహరణగా చూపగలదా? ఒకవేళ ఉదాహరణగా చూపదలచినచో అది కేవలం ఆ స్వచ్ఛమైన సేవకుల నుండి మాత్రమే. లేకుంటే మరే ఇతర మతంలోనూ ఇలాంటి ఉదాహరణలు కనిపించవు." (సిరతున్నబి (స), అన్వర్-ఉల్-ఉలుమ్, సంపుటి. 1, పేజీలు. 544-545)

మిగిలిన సంఘటనలను తదుపరి జుమా ప్రసంగంలో ప్రస్తావించబడతాయి, ఇన్షా అల్లాహ్.

ఈ తరుణంలో, ప్రపంచంలోని ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా నేను మరోసారి దుఆల కోసం విజ్ఞప్తి చేయాలనుకుంటున్నాను. ఇప్పుడు, పాశ్చాత్య దేశస్తులతో పాటు మరియు అమెరికాకు చెందిన కొందరు ప్రతీకార చర్యలకు పరిమితి ఉండాలని మరియు ఇజ్రాయెల్ మరియు హమాస్ మధ్య శాంతిని సృష్టించడానికి మరియు కాల్పుల విరమణను స్థాపించడానికి. ప్రస్తుత వివాదంలో పశ్చిమ దేశాలు మరియు అమెరికా తమ పాత్రను పోషించాలని వార్తాపత్రికలలో రాయడం ప్రారంభించారు. అయినప్పటికీ, వారు యుద్ధాన్ని ముగించడం కంటే, యుద్ధ జ్వాలలను ఎగరవేయడంపై మొగ్గు చూపుతున్నారని కూడా వారు వ్రాస్తారు. అదే విధముగా నిన్నటి అమెరకా వార్త ఏమిటనగా, విదేశాంగ మంత్రి శాఖకు చెందిన ఒక ప్రధానాధికారి చాలా దౌర్జన్యం జరుగుతుందని రాజినామ చేశాడు. పరిస్థితి తీవ్ర స్థాయికి చేరుకోవడంతో పాటు చాలా మంది అమాయక పాలస్తీనియన్లపై క్రూరత్వానికి పాల్పడుతున్నందున, అగ్రదేశాలు చర్య తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. వారిలో మంచి మనసున్న వారు కూడ ఉన్నారని ఈ ఘటన తెలియజేస్తోంది. కొన్నిసార్లు యూదు రబ్బీలు కూడా వారి తరపున మాట్లాడటం మరియు అన్యాయానికి వ్యతిరేకంగా మాట్లాడటం మీడియాలో కనిపిస్తుంది.

రష్యా విదేశాంగ మంత్రి కూడా " ఒకవేళ పరిస్థితి ఇలాగే కొనసాగితే, ఈ యుద్ధం ఆ మొత్తం ప్రాంతంపైకి వ్యాపిస్తుంది. నిజానికి, నా దృష్టిలో, యుద్ధం మొత్తం ప్రపంచానికి విస్తరించవచ్చు" అని తెలిపారు. కావున ఇప్పటికైన వారు కన్నులు తెరవాలి.

నేను ఇంతకు ముందు చెప్పినట్లుగా, ముస్లిం ప్రపంచం ఏకం కావాలి మరియు ఒకే గొంతుకగా మాట్లాడాలి. అన్ని ముస్లిం దేశాలు, దాదాపు 53 లేదా 54 ముస్లిం దేశాలు ఉన్నాయని చెబుతుంటే, వారంతా ఏకతాటిపైకి వస్తే తప్పకుండా ప్రభావం ఉంటుంది. కాని ఒకటి లేదా రెండు ఒంటరి స్వరాలను వినిపించినచో ఎలాంటి ప్రభావం ఉండదు.

ప్రపంచంలో శాంతిని సాధించడానికి మరియు ఈ యుద్ధాన్ని ముగించడానికి ఇదే మార్గం. అందువల్ల, ప్రపంచాన్ని విధ్వంసం నుండి రక్షించడానికి ముస్లిం దేశాలు తమ పాత్రను పోషించడానికి తమ వంతు కృషి చేయాలి. సర్వశక్తిమంతుడైన అల్లా వారికి అలా చేయగల సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా!

ఏది ఏమైనా, మనం మాత్రం దుఆలపై దృష్టి పెట్టాలి. అల్లాహ్ ఈ యుద్ధానికి ముగింపు చేయుగాకా!. అల్లాహ్ అమాయక పాలస్తీనియన్లను రక్షించి వారిని కాపాడుగాకా!. క్రూరత్వం నుండి వారిని రక్షించుగాకా! అన్యాయాన్ని ప్రపంచం నుండి అంతం చేయాలి. అది ఎక్కడ ఉన్నా నిర్మూలించాలి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు ప్రార్థన చేసే సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా!. (ఆమీన్).

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)

## సదర్ అంజుమన్ అహ్మదియ్య ఖాదియాన్ అనుబంధ కార్యాలయాలలో సేవాభ్యర్థుల నియామక ప్రకటన...

**ద్వితియ స్థాయి సేవాభ్యర్థులకై నిబంధనలు:-**

(1) అభ్యర్థుల వయస్సు 18 నుండి 25 సంవత్సరాల మధ్య ఉండాలి. (2) అభ్యర్థులు 12వ తరగతి 45% మార్కులతో ఉత్తుర్ణులై ఉండాలి. (3) అభ్యర్థులు ఉర్దూ మరియు ఆంగ్ల భాషలో నిమిషానికి 25 పదాల వేగంతో టైపింగ్ చేయగలగాలి. (4) ఈ ప్రకటన జరిగిన 2 నెలల వ్యవధిలో దారఖాస్తు చేసుకున్న అభ్యర్థులనే పరిగణలోకి తీసుకోవడం జరుగుతుంది. (5) వ్రాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారినే ఇంటర్వ్యూ చేయడం జరుగుతుంది. (6)వ్రాత పరీక్ష మరియు కంప్యూటర్ టెస్ట్ మరియు ఇంటర్వ్యూలో ఉత్తీర్ణులైన తరువాత నూర్ ఆసుపత్రి ఖాదియాన్‌లో మెడికల్ పరీక్షలు చేయబడును. కావున నూర్ ఆసుపత్రికి చెందిన మెడికల్ బోర్డు ఆరోగ్యవంతులని సిఫారిస్సు చేయబడిన వారికే సేవ ఆవకాశం లభించును. (7) ఎంపికైన అభ్యర్థులు స్వయముగా ఖాదియాన్‌లో నివాస సదుపాయాలు కల్పించుకోవాలి. ఆ తరువాత కూడ వారి నుండి వచ్చే ఎలాంటి నివాస యెగ్యమైన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోవడం జరుగదు. (8) ఖాదియాన్‌కు వచ్చిపోయే ఖర్యులు కూడ అభ్యర్థులు స్వయముగా భరించవలెను. (9) క్రింద ద్వితియ స్థాయి సేవా అభ్యర్థులకు సంబంధించిన పరీక్ష నమూన గలదు. ఈ పరీక్షలోని ప్రతి భాగంలో తప్పకుండా ఉత్తీర్ణత సాధించవలెను. **1వ భాగం**: (1) ఖుర్‌ఆన్ కరీం పూర్తి పారాయణం మరియు మొదటి భాగం (పారా) అనువాదం వచ్చిఉండాలి. (2)చాలిస్ జవాహిర్ పారే (40 హదీస్‌లు), ఇస్లాం ప్రాథమిక సిద్ధాంతాలు (అర్కానే ఇస్లాం) మరియు పూర్తి నమాజ్ అనువాదంతో వచ్చిఉండాలి. (30 మార్కులు) **2వ భాగం:** (1)కిస్తియే నూహ్, బర్కాతు ద్దుఆ మరియు ధార్మిక పరిజ్ఞానం (దీని మాఅలూమాత్) పట్ల అవగాహన ఉండాలి. (2) అహ్మదియ్య జమాఅత్ యొక్క సిద్ధాంతాలను గూర్చి వ్యాసాలు వచ్చి ఉండాలి. (3) దుర్రే షమీన్‌లోని (షానే ఇస్లాం) నజం కూడ కంఠస్థమై ఉండాలి. (20 మార్కులు) **3వ భాగం** : ఇంటర్మీడియట్‌కు అనుకూలమైన అంగ్ల భాష పరిజ్ఞానం ఉండాలి. (20 మార్కులు) **4వ భాగం:** 10వతరగతికి అనుకూలమైన గణిత అనుభవం కూడ వచ్చి ఉండాలి. (20 మార్కులు) **5వ భాగం:** జనర్నల్ నాలేడ్జ్ (10 మార్కులు).

**(నోట్:వ్రాత పరీక్ష, ఇంటర్వ్యూల తేదిలను తరువాత ప్రకటించడం జరుగుతుంది. )**

## సదర్ అంజుమన్ అహ్మదియ్య, అంజుమన్ తహ్‌రీకే జదీద్, అంజుమన్ వఖ్ఫే జదీద్ ఖాదియాన్ సంస్థల యందు తోటమాలి/ వంటమనిషి/ రొట్టెలు చేయువ్యక్తి/ వాచ్‌మెన్/ సెక్యూరుటి వంటి సేవా కల్పన ప్రకటన...

**4వ స్థాయి సేవాఅభ్యర్థుల నిబంధనలు..**

(1) అభ్యర్థుల వయస్సు 18 నుండి 40 సంవత్సరాల మధ్యలో ఉండాలి. (2) అభ్యర్థలకు ఖచ్చితమైన విద్యా అర్హత ఏమి లేదు. కాని విద్యావంతులకు ప్రాధాన్యత నివ్వబడను.(3) జనన దృవపత్రం తప్పకుండా జత చేయవలెను. (4)ఈ ప్రకటన తరువాత 2 మాసాలలోపు పంపబడిన అభ్యర్థనలనే పరిగణలోకి తీసుకోవడం జరుగుతుంది. (5) కేంద్ర సేవాభర్తిల కమిటి ఇంటర్వ్యూలో ఉత్తీర్ణులైన వారే ఇట్టి సేవకు అర్హులు. (6) ఇంటర్వ్యూలో ఉత్తీర్ణులై తరువాత నూర్ ఆసుపత్రి ఖాదియాన్‌లో వైద్య పరీక్షలు జరుపబడును. అట్టి పరీక్షలలో ఆరోగ్యవంతులుగా సిఫారిస్సు చేయబడిన వ్యక్తులనే కమిటి ఎంపిక చేస్తుంది.(7) ఎంపిక తరువాత ఖాదియాన్‌లో నివాస ఏర్పాట్లను అభ్యర్థులే స్వయముగా ఏర్పర్చుకోవలెను. (8) ఖాదియాన్‌కు వచ్చిపోయే ప్రయాణ ఖర్చులను కూడ అభ్యర్థులే భరించవలెను.

**(నోట్: ఇంటర్వ్యూల తేదిలను తరువాత ప్రకటించడం జరుగుతుంది. )**

---

**మిక్కిలి సమాచారం కోసం ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.**
**నజారత్ దీవాన్ సదర్ అంజుమన్ అహ్మదియ్య ఖాదియాన్ (143516)**
**ఫోన్ నెం॥ 09682627592, 09682587713.**
**ఆఫీస్ : 01872 - 501130**

99633 83271 Pro. SK.Sultan 97014 62176
Oxygen Nursery
All kind of Plants are Available.
➤ Rajahmundry
➤ Kadiyapu lanka, E.G.dist.
➤ Andhra Pradesh 533126.
➤ #email. oxygennursery786@gmail.com
Love for All...Hatred for None

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

**విశ్వాస స్త్రీల లక్షణాలు మరియు నేటి కాలంలో వాటిని పొందుట.**

గౌ॥ సభాధ్యక్షురాలు మరియు గౌ॥ సోదరీమణులారా!

అస్సలాము అలైకుమ్ వరహ్మతుల్లాహి వబరకాతుహు

ఇంతకుముందు నేటి ఈ పవిత్ర సందర్భంన నా ఉపన్యాస శీర్షిక "విశ్వాస స్త్రీల లక్షణాలు మరియు నేటి కాలంలో వాటిని పొందుట" అని మీరు విన్నారు.

గౌ॥ సోదరీమణులారా! హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి.

"అన్నిటికంటే మొదట ఖుర్‌ఆన్ గలదు.......ఖుర్‌ఆన్‌లోని ఏడు వందల ఆదేశాలలోని ఒక్క చిన్న ఆదేశంను కూడ విస్మరించిన వ్యక్తి తన స్వహస్తాలతో మోక్షపు ద్వారాన్ని తన కొరకు మూసుకొనును. స్వచ్ఛమైన, సంపూర్ణ మోక్షపు మార్గాలను పవిత్ర ఖుర్‌ఆన్ తెరిచెను. మిగతావన్ని దానికి నీడగా ఉన్నా యి. కావున మీరు ఖుర్‌ఆన్‌ను శ్రద్ధతో చదవండి, మీరు మరెవరిని ప్రేమించనంతగా దానిని అమితంగా ప్రేమించండి. ఎందుకనగా నన్నుద్దేశించి అల్లాహ్ తఆలా ఇట్లనెను. اَلۡخَیۡرُ کُلُّہٗ فِی الۡقُرۡاٰن అనగా అన్ని రకాల మేలు పవిత్ర ఖుర్‌ఆన్‌లోనే గలదు. వాస్తవానికి ఇదే నిజం. కాని దీనిపై మరొక దానికి ప్రాధాన్యత నిచ్చేవారిపై విచారము. మీ సర్వ సఫలము, మోక్షమునకు చెలిమి పవిత్ర ఖుర్‌ఆన్. మీకు అవసరమున్న ధార్మిక విషయాలన్ని ఇందులో గలవు. ప్రళయ దినమున మీ విశ్వాసంను ధృవీకరించేది లేదా తిరస్కరించేది పవిత్ర ఖుర్‌ఆనే. ఖుర్‌ఆన్‌ను విస్మరించి మీకు సన్మార్గమిచ్చేది ఖుర్‌ఆన్ తప్ప ప్రపంచంలో మరొక గ్రంథం లేదు."

(కష్తీ నూహ్, రూహానీ ఖజాయిన్ సంపుటి 19 పుట 26)

కావున ఒక విశ్వాసికి (పురుషుడైనను లేక స్త్రీ అయినను) అన్ని ఆదేశాలు, లక్షణాలు పవిత్ర ఖుర్‌ఆన్‌లో గలవు. నా ప్రసంగపు ఈ కొద్ది సమయంలో వీటన్నిటిని ప్రస్తావించుట సాధ్యం కాదు. స్త్రీ విశ్వాసుల కొన్ని లక్షణాలను దైవ ఆదేశాల మేరకు ప్రస్తావించుటకు నేను ప్రయత్నింతును. అల్లాహ్ తఆలా ఇందుకు మనందరిని అనుగ్రహించుగాక!

గౌ॥ సోదరీమణులారా! నేను ఆరంభంలో పఠించిన సూక్తిలో అల్లాహ్ తఆలా ఇట్లు సుడివెను. క్షమాపణ కోరువారికి, ఆరాధించు వారికి, (అల్లాహ్) సంకీర్తనలను స్మరించు వారికి,(అల్లాహ్ మార్గములో) ప్రయాణము చేయువారికి, అల్లాహ్ ముందు మోకరిల్లు వారికి, సాష్టాంగ నమస్కారములు చేయు వారికి, మంచి మాటలను ఆజ్ఞాపించు వారికి, చెడు మాటలతో ఆపువారికి, అల్లాహ్ హద్దులను రక్షించు ఇలాంటి విశ్వాసులకు నీవు శుభవార్తనివ్వుము.

కావున ఇటువంటి నిజమైన విశ్వాసురాలి, ముస్లిం మహిళ లక్షణాలను కల్పించుకొంటూ మన హృదయం ప్రతి క్షణం అల్లాహ్‌ను ప్రశంసిస్తు ఉండవలెను. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాతు వస్సలాం ఈ క్రింది విధంగా ఉపదేశించినట్లు మన స్థితి ఉండవలెను.

"తమ ప్రభువు వైపు పూర్తిగా మరులుము. ప్రపంచము పట్ల అయిష్టమును వ్యక్తపర్చుము. అతనికే అంకితమైపోవుము. అతని కొరకే జీవించుము. అతడు పవిత్రుడైనందున అపరిశుభ్రతలన్నింటిని, పాపములన్నింటిని అతని కొరకే విడనాడుము. నీవు రాత్రి యంతయు ధార్మికతతో గడిపినావని నీ కొరకు ప్రతి ఉదయం సాక్ష్యమివ్వవలెను. నీవు పగలంతయు ధార్మికతతో గడిపినావని నీ కొరకు ప్రతి రాత్రి సాక్ష్య మివ్వవలెను."(కష్తీ నూహ్, రూహానీ ఖజాయిన్ 19 పుట 12)

కనుక దైవభీతిని కల్గి ఉండుట కూడ చాలా తప్పనిసరి. అనగా విశ్వాసపు శిఖర స్థాయికి చేరుకొని మానవుడు దైవభీతి సూక్ష్మాతిసూక్ష్మమైన మార్గాలను అనుసరించవలెను. అల్లాహ్ తఆలా ఇట్లు సుడివెను.

అనగా ఓ విశ్వాసులారా! మీరు అల్లాహ్‌కు భయపడినచో అతడు మీ కొరకు ఒక గొప్ప స్థానమును సృష్టించును. మీ బలహీనతలను దూరము చేయును. మిమ్ము క్షమించును. అల్లాహ్ గొప్పగా అనుగ్రహించువాడు. (అల్ అన్ఫాల్:30)

దైవభీతి గురించి హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాతు వస్సలాం తమ పద్యంలో ఇట్లనిరి.

ہر اک نیکی کی جڑ یہ اتقا ہے　　اگر یہ جڑ رہی سب کچھ رہا ہے

అనగా ప్రతి సత్కార్యంనకు పునాది దైవభీతి. ఈ పునాది మంచిగున్నచో అంతా బాగుండును.

మరొచోట అల్లాహ్ తఆలా ఇట్లు సుడివెను. اَطِیۡعُوا اللّٰہَ وَرَسُوۡلَہٗۤ اِنۡ کُنۡتُمۡ مُّؤۡمِنِیۡنَ (అల్ అన్ఫాల్:2) అనగా మీరు విశ్వాసులే అయినచో తగిన రీతిలో అల్లాహ్ తఆలా విధేయత వహించుము అలాగే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు పూర్తిగా విధేయులుగా మారుతు వారి స.అ.స. ఉత్తమ ఆదర్శంను తమ జీవితాలలో సంపూర్ణంగా పాటించండి.

గౌ॥ సోదరీమణులారా! పవిత్ర ఖుర్‌ఆన్‌ను ఆరంభం నుండి చివరి వరకు తెలుసుకొనుట ప్రతి విశ్వాసురాలి కర్తవ్యం. ఇంతకు ముందు ఎవరికి తెలియని పవిత్ర ఖుర్‌ఆన్ జ్ఞానములు, విశ్లేషణలను ఈ కాలములో చివరి కాలపు మసీహ్ ద్వారా మనం పొందినందుకు మనమెంతో అదృష్టవంతులం. వాటిని పఠించుట, వాటిని ఆచరించుట మన బాధ్యత. దానిని ఎంతగా ప్రేమించాలనగా పవిత్ర ఖుర్‌ఆన్ ప్రకారం మన జీవితం మారవలెను. పవిత్ర ఖుర్‌ఆన్ పట్ల ఈ క్రింది విధంగా హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం వ్యక్త పరచిన అభిమానంను మనం మన పిల్లల్లో ఏర్పాటు చేయవలెను.

دِل میں یہی ہے ہر دم تیرا صحیفہ چوموں　　قرآں کے گرد گھوموں کعبہ میرا یہی ہے

అనగా అనుక్షణం నీ గ్రంథంను ముద్దాడాలని నా మనసు ఆశిస్తుంది. నా కాబా ఇదేనని భావిస్తు ఖుర్‌ఆన్ చుట్టు తిరుగుతుందును గాక!

గౌ॥ సోదరీమణులారా! మహిళా విశ్వాసుల లక్షణం اَلصّٰدِقٰت సంపూర్ణ సత్యవంతులైన స్త్రీలగుట కూడ గలదు. అనగా తమ మాటలు, చేతలలో సత్యమునే ఖచ్చితంగా పాటింతురు. మనం బైఅత్ సందర్భంన చేసిన ప్రతిజ్ఞను పూర్తి చేయవలెను. మనం చెప్పిన మాటను పూర్తి చేసి చూపవలెను.

గౌ॥ సోదరీమణులారా! మనం వస్తువులకు గురైన ప్రపంచవాసులం.నిది పశ్చిమంతో ప్రభావితమైనది. ఈ ప్రపంచంలో నగ్నత్వం, నిర్లజ్జత మంచి విషయంగా భావించబడుతుంది. ఈ ప్రపంచంలో ఇస్లామీయ విలువలు తెలుసుకోవలసిన అవసరమున్నది. ఈ ఆధునికతకు గురగుట, ఈ కాలపు ఆచారాన్ని పాటిస్తు దానికి అలవడుట ఒక స్త్రీ కర్తవ్యమా! కానే కాదు. ప్రాపంచికంను తన ఉద్దేశ్యంగా చేసుకొనుట ఒక అహ్మదీ స్త్రీ కర్తవ్యం కానే కాదు. ఈ ప్రపంచంలో నివసిస్తు అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించిన విధంగా పవిత్ర జీవితంను అలవర్చుకోవలెను. దాని గురించి పవిత్ర ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ తఆలా ఇట్లు సూచించాడు.

అనగా పురుషుడు గాని, స్త్రీ గాని, విశ్వాసులుగా వుండి పుణ్యమగు, సరియగు కార్యము చేసినచో అతనికిగాని, ఆమెకి గాని మేము నిశ్చయంగా (నిర్మలమైన), పరిశుద్ధమైన జీవితమును ప్రసాదింతుము. మేము (వారందరికి) వారి ఉత్తమ కర్మల ప్రకారము ప్రతిఫలమునిత్తుము. (అన్నహ్ల్:98)

స్త్రీ విశ్వాసుల అసలు ఉద్దేశం ఆయా బహుమానాలకు వారసులగుట, ఇదే శాశ్వత జీవితంను పొందుట. ఇందుకు సత్కర్మలను అవలంబించుట కూడ అనివార్యమే. మొదటి కాలపు స్త్రీలు ఇస్లామీయ బోధనలను అచరించి తమ జీవితంలో విప్లవం సృష్టించినప్పుడు మనం నేడు కూడ ఆయా ఉదాహ రణలను పునరుద్ధరించగలం. ఎందుకనగా ఇదొక సజీవమైన ధర్మం. ఇది ప్రతి కాలములో ప్రభావాలు చూపును. నేడు పవిత్ర మసీహ్ జమాఅత్‌తో తమను తాము జోడించుకున్న తర్వాత ప్రవక్త విధేయతతో కూడిన ఆయా ఉదాహరణాలను జీవింపజేయుట మన బాధ్యత. అన్ని రకాల దురాచారాలు, ధర్మంలో లేని నూతన ఆచారాలను రూపుమాపవలెను. నగ్నత్వ, ముసుగు ధరించని ఈ కాలంలో ఇస్లామీయ పరదాను స్థాపింపజేయవలెను. తమ ధనంను దైవ మార్గంలో వినియోగించ వలెను, తమ ప్రాణాలను సమర్పిస్తు ఇస్లాంపై స్థిరంగా ఉండవలెను.

గౌ॥ సోదరీమణులారా! ఇస్లాం నిజమైన బోధనను అలవర్చే విధంగా తమ పిల్లలను తీర్చిదిద్దుట ఒక విశ్వాసురాలి ప్రథమ కర్తవ్యం. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్త్రీ అనుచరుల విధంగా తమ సంతానంను చక్కదిద్దవలెను. వారిని దేవుని ప్రియులుగా, ప్రవక్త ప్రియులుగా, ఖుర్‌ఆన్ ప్రియులుగా సంస్కరించవలెను.

హజ్రత్ ఖలీఫతుల్ మసీహిర్రాబె రహిమహుల్లాహు తఆలా ఇట్లు ఉపదేశించారు.

"మీ ఒడిలో పోషించబడుతున్న చిన్న బాల బాలికలు, మీ చేతులలో ఆడుతున్నారు. మీ స్తన్యం త్రాగి యవ్వనానికి చేరుతున్నారు లేదా మీ చేతులలో పాలు త్రాగుతు యువకులుగా మారుతున్నారు. ఈ కాలంలో అనగా బాల్యంలో

వారికి దేవుని ప్రేమ పద్యాలు వినిపించండి. దేవుని ప్రేమ గురించి వారితో మాట్లాడండి. తదుపరి మీ లక్ష్యాలన్నియు సులభమగును."

హుజూర్ రహిమహుల్లాహు ఇంకా ఇట్లనిరి.

"దేవుని ప్రేమను కలిగించుటకు మీరు దేవుని విషయాలు వినిపించవలెను. దేవుని మాటలు మాట్లాడుతున్నప్పుడు మీ హృదయంలో ప్రభావం లేనిచో, మీ కండ్లలో కన్నీరు ప్రవహించనిచో, మీ హృదయం వినయం వహించనిచో పిల్లలు దీనితో ప్రభావితులైతారని భావించుట, ఇదొక అసత్యపు కథ, ఇందులో ఎలాంటి వాస్తవం లేదు. ఎటువంటి తల్లుల పిల్లలు దేవున్ని ప్రేమిస్తారనగా వారు దేవుని గురించి ప్రస్తావించినప్పుడు వారి హృదయం కరిగి కన్నీరు ప్రవహించడం మొదలగును. వారి ముఖ కవలికలు మారిపోతాయి. ఈ తల్లికి ఏమైనదని పిల్లలు ఆశ్చర్యంగా చూస్తారు. ఎందుకు దుఃఖం కలుగుతుంది. ఏ భావం ఆమెను ఆవహించినది. ఇటువంటి ప్రభావం పిల్లల్లో ఒక పవిత్ర అద్భుత మార్పును కలిగిస్తుంది. ఇదే విప్లవ స్ఫూర్తి, ఇదే విప్లవానికి నాంది. ఇటువంటి తల్లులుగా సన్నద్ధం కండి, ఇలాంటి తల్లులగుటకు...దేవునితో సహాయం యాచిస్తు అతని అందంను అన్వేషించ వలెను. తుదకు ఆ అందం మీపై ప్రభావం చూపవలెను, మీ ఉనికి కరిగి పోయే విధంగా మీ హృదయాలలో ఇటువంటి ప్రేమ పూరించవలెను. కరిగిన తర్వాత ఒక నూతన ఉనికిగా మారవలెను."(ప్రసంగం 27 జూలై 1991–జల్స సాలానా మస్తూరాత్, ఇస్లామాబాద్, టిల్ఫోర్డ్, ఇంగ్లాండ్)

గౌ॥ సోదరీమణులారా! సయ్యద్నా హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ జల్స సాలానా ఖాదియాన్ సందర్భంగ 27 డిసంబర్ 2005వ తేదీన స్త్రీలనుద్దేశించి చేసిన ప్రసంగంలో స్త్రీల విశ్వాసుల లక్షణాలను తెలుపుతు ఇట్లనిరి.

"ఉత్తమ స్త్రీ ప్రత్యేకతలను అల్లాహ్ తఆలా ప్రస్తావించెను. అనగా వారు సంపూర్ణ విశ్వాస స్త్రీలుగా ఉందురు. ఇస్లాంను స్వీకరించినప్పుడు దానిని అర్థం చేసుకోవలెను, అల్లాహ్, అతని ప్రవక్త ఆదేశాలను ఆచరించవలెను. వారు వాశ్వాసరాళ్లుగా ఉండవలెను. విశ్వాసంలో ఎంత వరకు సంపూర్ణం కావలెననగా ఎటువంటి ఆపద లేదా పరీక్ష ఎదురైనను స్థిరత్వంలో ఎలాంటి తడబాటు రాకూడదు. వారిని ఎన్నడు దేవుని నుండి దూరం చేయకూడదు. ఇంకా ఎక్కువ దగ్గరకు చేర్చవలెను, అతని ముందు మోకరిల్లవలెను....వారిట్లనిరి. ఎటువంటి పరిస్థితులు ఎదురైనను ఏమాత్రం తగ్గ కూడదు. ఇలాగే వారు తమను తాము సంపూర్ణంగా అల్లాహ్‌కు సమర్పించినవారు కావలెను. విధేయతలో ముందడగు వేసినవారు కావలెను. జమాఅత్ వ్యవస్థకు విధేయులుగా ఉండవలెను. మనం ఒక వ్యవస్థకు కట్టుబడి నడుస్తున్నప్పుడు మాత్రమే మనం ప్రగతి సాధించగలం. పశ్చాత్తాపం పడువారు కావలెను. అనగా తప్పుల పట్ల పశ్చాత్తాపం వ్యక్త పరచవలెను. తమ గత పాపాలు, తప్పుల పట్ల అల్లాహ్ తఆలాతో క్షమాపణ కోరవలెను. గత తప్పులు, లోపాల నుండి భవిష్యత్తులో ఎల్లప్పుడు దూరముండుటకు ప్రయత్నిస్తామని సంకల్పించవలెను. వివిధ స్త్రీలలో మాటు వేసిన మొత్తం దురాచాల నుండి దూరముండుటకు ప్రయత్నించినప్పుడే నిజమైన పశ్చాత్తాపం అనబడును. మన ఈ తూర్పు సమాజంలోని ప్రతి ప్రాంతం, ప్రతి తెగ, ప్రతి వంశంలో విభిన్న దురాచాలు గలవు. కొన్ని సార్లు అవి భారమైతాయి, ఇవే భారాలు దురాచారములైతాయి. ఇవి ధార్మిక భాగాలుగా ఆచరించబడుతాయి. వాస్తవానికి ధర్మం సాదాతనం నేర్పుతుంది. తమ విశ్వాస దృఢత్వం కొరకు అల్లాహ్ తఆలా ఆస్థానంలో క్షమాపణ యాచిస్తు అతనితో సహాయం యాచించువారిగా కావలెను. ఆరాధన చేరువారిగా ఉండవలెను. అల్లాహ్ తఆలా ప్రార్థన చేయవలెను.............పుణ్యాత్మురాలుగా ఉండవలెను, ఉపవాసాలుండు వారిగా, తమ ఆధ్యాత్మిక స్థాయిని పెంచుకొనువారిగా ఉండవలెను, ప్రార్థనల వైపు దృష్టి సారించువారిగా ఉండ వలెను."

వారింకా ఇట్లనిరి.

"కావున అహ్మదీ స్త్రీలు ఈ విశిష్టతలను కల్పించుకోవలెను. ప్రతి క్షణం ఎల్లప్పుడు అల్లాహ్ తఆలా ఉనికి మాత్రమే ఆమె దృష్టిలో ఉండవలెను, అన్ని రకాల దుష్టత్వముల నుండి దూరముండవలెను, మనకు అహ్మదియ్య భావి తరాల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండుననే నమ్మకం కలుగుతుండును. ఇన్‌షా అల్లాహ్." వారింకా ఇట్లనిరి. "స్త్రీ పాదాల క్రింద స్వర్గమున్నదనే స్థాయి ఒక మహిళకు ఇవ్వబడెను. తల్లిని గౌరవించి, స్వర్గం పొందండనే ఆదేశం కేవలం సంతానంకు మాత్రమే లేదు. అల్లాహ్ తఆలా ప్రస్తావించిన విశిష్టతలను కల్పించుకొని, తమ సంతానం స్వర్గంలో ప్రవేశించే విధంగా సంతానంను తీర్చి దిద్దవలెననే ఆదేశం తల్లులకు కూడ ఇవ్వబడెను. "

గౌ॥ సోదరీమణులారా! ఇక నేను ఉపన్యాపు రెండవ భాగంను ప్రస్తావింతును. అనగా మహిళా విశ్వాసులు ఈ విశిష్టతలను ఎలా పొందగలరు.?

హజ్రత్ అమీరుల్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ జల్స సాలానా జర్మనీ సందర్భంగ 29 జూన్ 2013వ తేదీన కార్ల్స్‌రోయెలో స్త్రీలనుద్దేశించి చేసిన ప్రసంగంలో ఇట్లనిరి. "ఈ ప్రపంచం ఒక ప్రాపంచికుని జీవిత ఉద్దేశమై ఉండును, అల్లాహ్ తఆలా నుండి దూరం చేయబడునది. అదే ప్రపంచం ఒక విశ్వాసుడు అల్లాహ్ తఆలా శుభములను పొందుటకు కూడ కారణమగును. ఒక విశ్వాస స్త్రీ లేదా పురుషుడు అల్లాహ్ తఆలా ప్రసాదించిన ఈ ప్రాపంచిక శుభములను చూసినప్పుడు వాటిని కేవలం ప్రాపంచిక కోరికలను పూర్తి చేయునవిగా వాడడు. వీటికి నేను అర్హుడనైనందుకే నాకు ఇవన్ని లభించినవని ఒక విశ్వాస పురుషుడు అనడు లేదా విశ్వాస స్త్రీ అనదు. ఏ గొప్ప ఉద్దేశాలతో అల్లాహ్ తఆలా మానవుణ్ణి పుట్టించెనో వాటి నుండి ప్రాపంచిక ధనం, ఐశ్వర్యం, వసతులు ఒక విశ్వాసిని లేదా విశ్వాసురాలిని విస్మరింప జేయదు. వాటిలోని అన్నిటికంటే పెద్ద ఉద్దేశం అల్లాహ్ తఆలాను ఆరాధించుట. ఈ వరములు ఎక్కువైనప్పుడు ఒక విశ్వాసురాలి లేదా విశ్వాసుడు అల్లాహ్ తఆలా ఆస్థానంలో ఇంకా ఎక్కువ మోకరిల్లును.

అల్లాహ్ తఆలా ఆదేశం మేరకు అల్లాహ్ తఆలా ప్రాణుల హక్కు చెల్లిస్తు ఆయా వరముల ప్రస్తావన చేస్తుంటారు. అల్లాహ్ తఆలా అందించిన ధనంను కేవలం తమ అందంను బహిర్గతం చేయుటకే ఖర్చు చేయక అల్లాహ్ తఆలా ప్రేమను పొందుటకు తమ పేద సోదరీమణులు, సోదరుల హక్కు చెల్లించుటకు కూడ ఖర్చు చేయుటకు ప్రయత్నిస్తారు, వారికి సహాయమందించుటకు కూడ కృషి చేస్తారు. సోదరీమణులు, సోదరులనగా రక్త సంబంధమున్న సోదరీమణులు, సోదరులే కాక మానవ బంధుత్వం కలగిని సోదరీమణులు, సోదరులని భావించవలెను."

స్త్రీలనుద్దేశించి హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం చేసిన ఉపదేశాలు ఇట్లు గలవు. వారిట్లనిరి.

"నిష్కాపరతను అవలంభించండి. ఈ ప్రపంచం మరియు ప్రపంచ అంద చందాల కు మీరు ముగ్ధులు కాకండి. జాతి అహంకారాన్ని ప్రదర్శించకండి. ఏ మహిళను కించ పర్చకండి. మీ భర్తల స్థోమతను మించి కోరికలు కోరకండి. మీరు పుణ్య స్త్రీలుగా, పవిత్రురాల్లుగా సమాధి గావించబడుటకు ప్రయత్నించండి. నమాజ్, జకాత్ వంటి దేవుని హక్కులను చెల్లించుటలో అలసత్వం వహించకండి. మీరు మనస్ఫూర్తిగా మీ భర్తలకు విధేయులుగా జీవించండి. వారి అధికశాతం గౌరవ మర్యాదలు మీ చేతులలోనే ఉన్నాయి. కావున మీరు దేవుని సన్నిధిలో గుణవంతురాలుగా, శీలవంతురాలుగా పరిగణించబడు విధముగా మీ భాధ్యతలను మీరు శ్రద్ధగా నెరవేర్చండి. వృధా ఖర్చులు చేయకండి. మీ భర్తల సంపాదనను విచ్చల విడిగా ఖర్చు చేయకండి. మోసం, దొంగతనం చేయకండి. నిందలు వేయకండి, ఒక మహిళ మరో మహిళపై లేదా పురుషులపై అబంధాలు వేయకండి."

(కష్తీ నూహ్, రూహానీ ఖజాయిన్ సంపుటి 19 పుట 81)

హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ తమ ప్రసంగంలో అహ్మదీ స్త్రీలను ఉపదేశిస్తు ఇట్లనిరి.

"ఓ అహ్మదీ స్త్రీలారా! బాలికలారా! నేటి కాలంలో హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాతు వస్సలాం బైఅత్ చేసి తమను తాము నిష్కాపరతపై స్థాపించుకొంటామని ప్రతిజ్ఞ చేసినవారు! తమను తాము ప్రాపంచిక తళుకు బెళుకు నుండి దూరముంచుకుంటామని ప్రకటించిన వారు! తమ సౌందర్యంను పవిత్ర ఖుర్ఆన్ ప్రకారం రక్షించుకొంటామని ప్రకటించిన వారు!....తమ ధనంను ప్రాపంచిక అభిరుచుల బదులు ధర్మంను వ్యాపింపజేయుటకు ఖర్చు చేస్తామని ప్రతిజ్ఞ చేసినవారు! ఆత్మ పరిశీలన చేసుకోండి, ఎంత వరకు అల్లాహ్ తఆలా అసంతృప్తి నుండి దూరముంటూ తమ జీవితంను గడుపుతున్నారో గమనించండి....తమను తాము

ప్రాపంచిక మోసం నుండి ఎంత వరకు రక్షించుకుంటున్నారు. ఎంత వరకు తమ ప్రతిజ్ఞలను పూర్తి చేస్తున్నారు. ఎంత వరకు మీరు అల్లాహ్ తఆలా అనంత కరుణ విశాలతను అన్వేషించుటలో నిమగ్నమైనారు. ఒక స్వచ్ఛమైన విశ్వాసురాలిగా అల్లాహ్ తఆలా శుభములకు వారసులగుతున్నారు. తమ భర్తల గృహాలకు పర్యవేక్షకులుగా ఉంటూ తమ సంతానంను తళుకు బెళుకు ప్రమాదకర దాడుల నుండి రక్షించుకొనుటకు ఎంత వరకు ప్రయత్నిస్తున్నారు. తమ భర్తల ధార్మిక ప్రకోపంను ప్రేరేపించుటకు ఎంత వరకు కృషి చేస్తున్నారు. తద్వారా అల్లాహ్ తఆలా శుభములను పొందుతు ఎల్లప్పుడు అతని శుభములకు వారసులు కావచ్చును. ప్రతి అహ్మదీ స్త్రీ, పురుషుడు అల్లాహ్ తఆలా శుభాలను, అతని క్షమాపణ, అతని ప్రీతిని పొందుటకు గతం కంటే ఎక్కువ కృషి చేయువాడగును గాక!"

(ఉపన్యాసం: స్త్రీల జల్స సాలానా జర్మని 29 జూన్ 2013)

గౌ॥ సోదరీమణులారా! 30 అక్టోబర్ 2021వ తేదీన సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఉత్తర ఇంగ్లాండ్ మరియు స్కాట్‌న్యాండ్‌కు సంబంధించిన 13 సం॥ల నుండి 15 సం॥ల నాసిరాతుల్ అహ్మదియ్యతో ఆన్‌లైన్ భేటి అయ్యారు. ఇందులో ఒక నాసిర (బాలిక) హుజూరె అన్వర్‌ను ఇట్లు ప్రశ్న అడిగెను. సమాజంలో గల మెదడుకు సంబంధించిన వ్యాధులు, డిప్రెషన్ గురించి మీ అభిప్రాయమేమిటి? హుజూరె అన్వర్ ఇట్లు సమాధాన మిచ్చిరి. కొన్ని సార్లు మెదడుకు సంబంధించిన వ్యాధులు ఎందుకు వస్తాయనగా మనం చాలా అధికంగా ప్రాపంచిక విషయాలలో నిమగ్నమవుతున్నాము. మన కోరికలు, ఆశల ప్రాధాన్యతలు కూడ మారిపోయి నవి. మనం అల్లాహ్ తఆలా ప్రేమ, సామీప్యంనకు బదులు మనం ఇహలోక వస్తువుల వెనుక పరుగెత్తుతున్నాము. ఇదే ఇందుకు ప్రాథమిక కారణం. ప్రాపంచిక కోరికలు పూర్తి కానప్పుడు, మీరు కోరుతున్నవి మీకు లభించనప్పుడు మీకు నిరాశ కలుగుతుంది. ఈ నిరాశ తదనంతరం ఆందోళనను పెంచుతుంది. అందుకే అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో మనశ్శాంతి పొందుటకు ఉత్తమ పద్ధతి దైవ స్మరణ అని, దీనితోనే మనశ్శాంతి లభిస్తుందని తెలిపెను. కావున మీకు ఎప్పుడైనా ఏదైనా సమస్య ఎదురైనప్పుడు అల్లాహ్‌ను స్మరించండి. అతని ముందు మోకరిల్లండి. ఐదు పూటల నమాజులు క్రమం తప్పకుండా, వినయంతో చదవండి. తద్వారా అల్లాహ్ తఆలా మీకు మనశ్శాంతిని ప్రసాదించును, ప్రశాంత మనసు అందించును. ఫలితంగా మీరు సంతృప్తికరంగా తమను మెరుగ్గా భావింతురు.

ఈ కాలంలో ఆధునిక సాంకేతిక మరియు మీడియాను తప్పుగా వినియోగించుట నిస్సందేహంగా ఒక షైతానీ పని. ఇటువంటి షైతానీ దాడుల నుండి తప్పించుకొనుటకు గతం కంటే దుఆల ప్రాధాన్యత పెరుగుతుంది. దీని గురించి హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ తమ ఖుత్బా జుమా 20 మే 2016వ తేదీన మస్జిద్ నాసిర్ గోటన్ బర్గ్ స్వీడన్‌లో ఇట్లనిరి.

"విశ్వాసులను షైతానీ దాడుల నుండి రక్షించుటకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతగా చింతించే వారనగా వారు సల్లల్లాహు అలైహి వసల్లం తమ అనుచరులను షైతాన్ నుండి తప్పించుటకు దుఆలు నేర్పించేవారు. ఎంతటి అద్భుత దుఆలు నేర్పించేవారనగా దీనిని ఒక అనుచరుడు ఇట్లు తెలిపెను. వారు సల్లల్లాహు అలైహి వసల్లం మాకు ఈ క్రింది దుఆ నేర్పించారు.

ఓ అల్లాహ్! మా హృదయాలలో ప్రేమను పుట్టించుము. మమ్ములను సంస్కరించుము, మమ్ములను రక్షణ మార్గాలలో నడిపించుము, అంధకారముల నుండి మమ్ములను రక్షించి జ్యోతి వైపు మళ్లించుము. మమ్ములను బాహ్యాంతర దుష్టత్వముల నుండి రక్షించుము. మా కొరకు మా చెవులలో, మా కండ్లలో, మా భార్యలలో మరియు మా సంతానంలో శుభం కలిగించుము, మమ్ములను కరుణించుము. నిశ్చయంగా నువ్వే పశ్చాత్తాపంను ఆమోదించువాడవు, పదే పదే కరుణించువాడవు. మమ్ములను నీ వరాలకు కృతజ్ఞత తెలుపు వారిగా, వాటిని మంచిగా ప్రస్తావించువారిగా, వాటిని స్వీకరించువారిగా చేయుము. ఓ అల్లాహ్ మాపై వరాలను సంపూర్ణం చేయుము."

(సునన్ అబూ దాఊద్ కితాబుస్సలాత్ బాబుత్తషహ్హుద్ హదీస్ నం. 969)

ప్రాపంచిక అనవసరాల నుండి నివారించుటకు ఈ దుఆ చదవవలెను.

గౌ॥ సోదరీమణులారా! నేటి యుగంలో హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు బినస్రిహిల్ అజీజ్ ప్రత్యేకంగా అహ్మదీ మహిళలనుద్దేశించి తమతో పాటు తమ సంతానాల విశ్వాసంను రక్షించుటకు అల్లాహ్ తఆలా ఆదేశాలను పాటించాలని ఎంతో గద్గద స్వరంతో ఉపదేశిస్తు ఇట్లనిరి.

"తమను తాము ప్రాపంచిక అపవిత్రత నుండి రక్షించుకొనుటకు, శుభాంతమగుటకు, శుభాంతం వైపు అడుగు వేయుటకు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాతు వస్సలాం బైఅత్ చేసినందున ఈ సమాజంలో ఎంతో జాగ్రత్తగా అడుగులు వేయవలెను. తమ వస్త్రధారణలో కూడ జాగ్రత్త పడవలెను, తమ ముసుగు పట్ల దృష్టి సారించవలెను, తమ కదలికల పట్ల చైతన్యం చూపవలెను, తమ సంభాషణను కూడ మెరుగుపరచుకోవలెను. వారిట్లనిరి. ఒకమ్మాయి పాకిస్తాన్ నుండి జీన్స్‌తో పాటు పొడుగాటి చొక్కా ధరించుటలో ఏమైనా అభ్యంతరం ఉందా! అని ప్రశ్నించెను. ప్రభావం అవుతుంది కదా! జీన్స్‌తో పాటు పొడుగాటి చొక్కా ధరించడంలో ఎలాంటి అభ్యంతరం లేదు. ఎలాంటి తప్పు లేదు. కాని పరదా షరతులన్ని పూర్తి కావలెను. కాని నేను ఆమెతో కూడ ఇట్లన్నాను. కొంత కాలం తర్వాత ఆ పెద్ద చొక్కా చిన్నదగును. అనంతరం బ్లౌజ్ రూపంలో మారునని నాకు భయమేస్తుంది. ఫ్యాషన్ ప్రకారం లేదా ఇతరులను చూసి చేసే పనులలో తర్వాత కాలం ప్రకారం మరింత దిగజారి నడుచుకునేందుకు ప్రయత్నించడం మొదలవుతుంది. ఇంకా అనేక చెడు ప్రభావాలు ప్రారంభమవుతాయి. అనంతరం సమయం వచ్చినప్పుడు తెలుస్తుంది. షైతాన్ దాడులకు ఎక్కువ ప్రమాదమున్న మార్గాల నుండి ఎల్లప్పుడు దూరముండవలెను. మీరు మీ సంతానం విశ్వాసంలో అభివృద్ధి చెందవలసి ఉన్నది. కనుక అధికాధికంగా అల్లాహ్ తఆలా వైపు తీసుకెళ్లే మార్గాలను అనుసరించుటకు ప్రయత్నించండి. దైవ స్మరణ చేయువారిగా అగుటకు కృషి చేయండి. ఆరాధకురాళ్లుగా మారుటకు ప్రయత్నించండి. తమను తాము అల్లాహ్ తఆలా ఆదేశాలకనుగుణంగా నడుచుకొనువారిగా చేసుకొటకు కృషి చేయండి."

(ఉపన్యాసం: స్త్రీల జల్స సాలానా స్విట్జర్ల్యాండ్ దివి: 4 సెప్టెంబర్ 2004)

అనగా అల్లాహ్ ప్రేమ పెరగుగాక! మీకు దైవ దర్శన అభిరుచి లభించుగాక!

దైవ ఏకత్వ సాక్ష్యం పెదాలపై ఉండుగాక! విశ్వాస ఆనందం హృదయంలో నుండు గాక!

మీ హృదయాలను శాసనం ఆదేశించు గాక! హజ్రత్ ముహమ్మద్ స.అ.స. స్నేహం లభించుగాక!

పవిత్ర ఖుర్‌ఆన్ చేతులలో, కాంతి హృదయంలో నుండుగాక! విశ్వాసుల వివేకం లభించుగాక!

వ ఆఖిరు దావానా అనిల్ హందులిల్లాహి రబ్బిల్ ఆలమీన్


Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

**నూరుల్ ఇస్లాం శాఖ:**

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**

**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**

**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలవు).**

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA
POSTAL REG NO GDP-38/2023-2025, Vol. 9 Thursday, 08 - FEB - 2024 Issue No - 06

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail:managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

విశ్వాసుల జమాఅత్‌లో ఖిలాఫత్ వ్యవస్థ మరియు సభ్యులందరు ఒకే త్రాటిపై ఏకం కావడం వంటివి ఒక గొప్ప దైవానుగ్రహంగా భావించాలి. ఈ బహుమానంను గౌరవిస్తూ, పూర్తిగా విలువలతో నేటి కాలపు ఈ అనుగ్రహాన్ని పటిష్టముగా పట్టుకోవడం, మరియు ఈ వ్యవస్థతో మనస్పూర్తిగా అనుసంధానం కావడం ఇరులోకాల సాఫల్యతలకు శుభసూచకం అవుతుంది.

శ్రోతలారా! క్రమశిక్షణకు చెందిన ఉత్తమ విధానం ఏమిటనగా, ఇతరుల మనోభావాలను, వారి ఆలోచనలను, వారి గౌరవ మర్యాదలను ఎల్లప్పుడు గుర్తుంచుకొని మాట్లాడవలెను. ప్రేమాను రాగాలను వ్యక్తపర్చునట్టి విధముగా వారితో వ్యవహరించవలెను. కావున ఖలీఫాల శుభప్రదమైన జీవితంలో మనకు ఇలాంటి ఎన్నో శుభప్రదమైన సంఘటనలు కనిపిస్తుంటాయి. జమాఅత్ సభ్యుల కోసం వారి మనస్సులో అమితమైన ప్రేమాభిమానాల ఉదాహరణలు కనిపిస్తుంటాయి.

అదే విధముగా ఆబిద్ ఖాన్ గారు తమ డైరిలో మరొక సంఘటనను ఈ విధముగా పేర్కొన్నారు:

2018లో అమెరికా పర్యటనకు చెందిన అంశం ఇది. హుజూర్ అన్వర్ ఒకచోట పరిశీలిస్తూ లైన్లను చూశారు. అక్కడ కొందరు యువకులు కాపాల కోసం నిలబడి ఉన్నారు. మార్గ మధ్యలో బురద ఉన్నదన్న కారణం చేత అక్కడి సదర్ మజ్లిస్ ఖుద్దాముల్ అహ్మదియ్య హుజూర్ ను వారి వద్దకు తీసుకపోవడం లేదు. కాని ప్రియ ఖలీఫా గారు బురదను ఏ మాత్రం పట్టించుకోలేదు. అక్కడి చేరుకొని యువకులను కలిసి పలుకరించారు. ఆ సమయంలో హుజూర్ అన్వర్ మరో చోటుకు అనగా వంటలు తయారు చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించుటకు వెళ్ళుచున్నారు. అక్కడ హుజూర్ కు టెబుల్ పై ఒక సాలే పురుగు కనిపించింది. హుజూర్ అన్వర్ వెంటనే ఒక టిష్యూ పేపర్‌తో ఆ సాలే పురుగును పట్టుకొని దానిని విసిరి వేయమని అహ్మద్ గారికి ఇచ్చారు. భోజనంలో ఎక్కడ పడిపోతుందో అని హుజూర్ ఆ పని చేశారు.

శ్రోతలారా! సయ్యదినా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు జమాఅత్ సభ్యుల కొరకు సుదూర ప్రాంతాలకు కూడ పర్యటించేవారు. ప్రయాణ ఇబ్బందులను కూడ లెక్కచేయకుండా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారి ప్రియమైన జమాఅత్ సభ్యులను కలవడానికి వెళ్ళేవారు. కొన్ని సందర్భాలలో హుజూర్ గారి ఈ ప్రేమాను రాగాలను చూసి జమాఅత్ సభ్యులే ఆశ్చర్యపోయేవారు.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు 2018వ సంవత్సరంలో అమెరికా, గోయిటేమాలా దేశాలను పర్యటించారు. ఆ పర్యటనలో నిర్వాహకులు హుజూర్ అన్వర్‌ను ఒకరోజు విహార యాత్రకు కూడ తీసుకెళ్ళారు. ఆ క్రమంలోనే అక్కడి ప్రముఖ ఎల్టేన్ చెలిమ వద్దకు కూడ తీసుకవెళ్ళారు. అక్కడ హుజూర్ అన్వర్ గారు వారితో ఇలా అన్నారు. ఈ రోజు అమెరికాకు చెందిన జమాఅత్ సభ్యుల కుటుంబాలను కలసినచో ఎంతో బాగుండేది అని అన్నారు.

ఈ ప్రేమ ఎన్నడు కరిగిపోనిది. మరెక్కడ దొరకనిది. ఈ ప్రేమ వర్తమాన ఖలీఫా మనస్సులో ఎన్నడు కనిపిస్తూనే ఉంటుంది.

ఈ అసాధారణమైన ప్రేమాభిమానాల వలనే జమాఅత్ సభ్యులు కూడ హుజూర్ అన్వర్‌ను ఒక్కసారైన చూడాలనే ఉత్సాహంతో వేలాది మైళ్ళను దాటుచూ, ఏ సమస్యను లెక్కచేయకుండా తమ ప్రియ ఖలీఫాను చూసేందుకు చేరుకుంటారు. సత్యవంతుల సాన్నిహిత్యంలో ఉండడం, వారి సాన్ని హిత్యం నుండి ప్రయోజనాన్ని పొందడం కోసం విశ్వాసం తప్పని సరి. నేటి కాలంలో అల్లాహ్ తాలా ఖిలాఫత్ రూపంలో మనకు సత్యవంతుల సాన్నిహిత్యాన్ని అనుగ్రహించాడు. ఈ అనుగ్రహం మన క్రమశిక్షణ, మంచి మార్పుకు చాలా ముఖ్యం. హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఖిలాఫత్ నీడలో జమాఅత్ సభ్యుల ప్రేమాభిమానలను గూర్చి ఇలా తెలిపారు:

ఎవరికి ఎంత వరకు సాధ్యమవుతుందో ప్రయత్నించండి. మహిళలు, పిల్లలు, వృద్ధులు ఏకదాటిగా కన్నీరు పెట్టుకోవడాన్ని నేను చూశాను. ఖిలాఫత్ పట్ల వారి మనస్సులో ఉన్న దీనిని ప్రేమ అని అంటారు. పిల్లలు కుడి నుండి, ఎడమ నుండి, సెక్యూరిటి వారి నుండి తప్పించుకొని వచ్చి అల్లుకునేవారు. ఆ ప్రేమాభిమానాలను అల్లాహ్ తాలా పిల్లల మనస్సులో నాటినాడు. ఇతరులు చెప్పడం వలన ఇలా సాధ్యం కాదు. వారి తల్లి దండ్రులు, వారి బంధువులు ఏకమయ్యే వారు. వారి ప్రేమాభిమానాలు కూడ వర్ణానాతీతం. ఆపై ఆ పిల్లలను హత్తుకునేవారు. అందుకు కారణం మీరు వర్తమాన ఖలీఫాను హత్తుకున్నారు, హుజూర్ ప్రేమను పొందారు కావున వారిని కూడ వారి బంధువులు హత్తుకునేవారు.

(మష్అలే రాహ్ సంపుటి 5, పుట 20)

ఇలాంటి పర్యటనలు జమాఅత్ సభ్యుల విశ్వాసాన్ని, నమ్మకాన్ని పెంచుతాయి. విజ్ఞాన, క్రమశిక్షణలతో పాటుగా నిర్వాహణ పరమైన అంశాలను కూడ నేర్చుకునే అవకాశాలను కల్పిస్తుంటాయి. హుజూర్ అన్వర్ గారి శిక్షణ విధానం, అద్భుత విధానంను గూర్చికూడ మనకు తెలుస్తుంది.

2018 నాటి అమెరికా మరియు గోయిటేమాలా పర్యటనలో హుజూర్ అన్వర్ అమెరికాకు చెందిన నాయబ్ అమీర్ గౌ॥ యూనుస్ గారిని మజ్లిస్ అన్సారుల్లాహ్ యు. ఎస్. ఏ కు చెందిన హౌజింగ్ ప్రాజెక్ట్‌ను గూర్చి అడిగి తెలుసుకున్నారు. అందుకు గౌ॥ నాయిబ్ అమీర్ గారు కొన్ని కారణాల వలన ఆలస్యం అవుతుంది అని సమాధానం ఇచ్చారు. అందుకు హుజూర్ అన్వర్ గారు ఇలా తెలిపారు:

"ఆలస్యం అయినచో దుఆల కోసం ఎక్కువ సమయం లభిస్తుంది అని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపారు. కావున దుఆలు చేస్తుండండి. ఆందోళన చెందవలసిన అవసరం లేదు"

(నోట్స్ డైరి అమెరికా మరియు గోయిటే మాలా 2018, కూర్పు ఆబిద్ ఖాన్ గారు.)

శ్రోతలారా! ఆలోచించి చూడండి! హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు దుఆలు చేయమని ఎంత అద్భుతముగా నచ్చజెప్పారో. ఈ హితోపదేశం మనందరికి మార్గదర్శకం. ఇందులోనే మన విజయాలన్ని గలవు.

శ్రోతలారా! మనం ఖిలాఫత్ నీడలో ఉండడం నిజంగా మన అదృష్టం. నేటి కాలంలో ముసల్మానులు నలువైపుల నుండి అల్లరులు, అలజడులలో చిక్కుకున్నారు. కాని మనం ఖిలాఫత్ లాంటి పటిష్టమైన కోటలో సురక్షితముగా ఉన్నాము. కావున మనం వర్తమాన ఖలీఫా పట్ల పూర్తి వినయంను, విధేయతను ప్రదర్శిస్తూ వారి విధేయులమైపోవాలి. అప్పుడే మనం ఖిలాఫత్ శుభములను పొందగలము. చివరిలో సయ్యదినా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి ఒక ఉపదేశాన్ని మీ ముందు వినిపించి నా ఉపన్యాసాన్ని ముగిస్తున్నాను. హుజూర్ ఇలా తెలిపారు:

"గుర్తుంచుకోవలసిన విషయమేమనగా నేడు దేవుని త్రాడుగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వ్యక్తిత్వం మన ముందు ఉన్నది. వారి బోధనలను ఆచరించవలెను. ఖిలాఫత్‌తో అనుసంధానమై ఉండడం కూడ మిమ్ములను పటిష్టపర్చును. ఖిలాఫత్‌యే మీ ఐక్యతకు మూలం. ఖిలాఫత్‌యే మీ పటిష్టత. ఖిలాఫత్ మిమ్ములను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) మరియు ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను కలుపు నట్టి మాధ్యమం. కావున ఈ త్రాడును గట్టిగా పట్టుకొనుము. ఎవరైతే పట్టుకోరో వారు చెల్లా చెదురైపోతారు. కేవలం వారు నాశనం కావడమే గాకుండా తమ సంతానాన్ని కూడ నాశనం చేసుకున్న వారగుదురు.'

(ఖుత్బాతే మస్రూర్ సంపుటి 3, పుట 516–518)

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz